మేక్ ఇన్ ఇండియాకు 12 ఏళ్లు MAKE IN INDIA స్వయం సమృద్ధి, నైపుణ్యం, భవిష్యత్ కోసం సన్నద్ధం

VELTHURU TELUGU DAILY

వెలుతురు

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

రంగారెడ్డి, నల్గొండ : శుక్రవారం 25.09.2026 ,సంపుటి : 09 సంచిక : 103, పేజీలు : 12 , వెల:రూ . 5/- ,SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

మేక్ ఇన్ ఇండియాకు 12 ఏళ్లు MAKE IN INDIA స్వయం సమృద్ధి, నైపుణ్యం, భవిష్యత్ కోసం సన్నద్ధం

Government of India

మునుపెన్నడూ లేని విధంగా భారత్ గర్జిస్తోంది!

తయారీ రంగ స్వరూపాన్ని మార్చేసిన పీఎల్ఐ పథకాలు

- ₹ 23.8 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తి/అమ్మకాలు
- ₹ 15.5 లక్షల కోట్లకు పైగా విలువైన ఎగుమతులు
- 14.6 లక్షల ఉద్యోగాల కల్పన

తయారీ రంగంలో భారత్ ప్రభంజనం

- దేశంలో ప్రస్తుతం వినియోగిస్తున్న 99.2 శాతం మొబైల్ ఫోన్లు భారత్‌లోనే తయారవుతున్నాయి
- ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం 2014లో ₹ 1.90 లక్షల కోట్ల నుంచి ₹ 13.11 లక్షల కోట్లకు అంటే దాదాపు 6 రెట్లు వృద్ధి చెందింది. 25 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించింది.
- 2014లో ₹ 46,400 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తి 280 శాతానికి పైగా వృద్ధి చెంది ₹ 1.78 లక్షల కోట్లకు చేరింది

'స్టార్టప్' అంటేనే భారత్ అన్నది స్థిరపడింది

- 2.5 లక్షలకు పైగా అంకుర సంస్థలు
- అందులో దాదాదాపు 50 శాతం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి
- 25 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించిన అంకుర సంస్థలు

బృహత్ లక్ష్యాలు, ఉన్నత ఆశయాలు

- 2014లో 468 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు 84 శాతం పెరిగి 863 బిలియన్ డాలర్లకు చేరాయి
- మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ₹ 43 లక్షల కోట్ల ప్రోత్సాహకం
- 20 పారిశ్రామిక స్మార్ట్ నగరాలకు భారత ప్రభుత్వం ఆమోదం
- 2025-26లో 1.40 లక్షలకు పైగా పేటెంట్ దరఖాస్తులు రెండు దశాబ్దాల్లో ఇదే అత్యధికం

ప్రతి ఉత్పత్తికి ఓ మార్కెట్

- ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఓడిఓపీ) పరిధిలో 773 జిల్లాల నుంచి 1,244 ప్రత్యేక ఉత్పత్తుల ఎంపిక, చేతివృత్తుల వారికి అందిస్తున్న తోడ్పాటు
- చిన్న సంస్థలకు విస్తృత ప్రోత్సాహం అందించేలా ఓపెన్ నెట్ వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ద్వారా 470 కోట్లకు పైగా ఆర్డర్లు

మేక్ ఇన్ ఇండియాకు 12 ఏళ్లు MAKE IN INDIA

స్వయం సమృద్ధి, నైపుణ్యం, భవిష్యత్ కోసం సన్నద్ధం

"నవ భారతదేశం చిప్ నుంచి ఓడ వరకు తయారీ రంగంలో ఒక కొత్త గాథను లిఖిస్తోంది."

- నరేంద్రమోదీ

CBC 07101/13/0042/2627

'సర్' పై అనుమానాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

గత 10 నెలల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై చీఫ్ ఎన్నికల కమిషనర్ ను విభేదిస్తూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి లు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న అంశాలు వెలుగులోకి వచ్చాయని వారి అభ్యంతరాలు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందే పౌరులు ఉపయోగించే ఫారం-6లో సర్ కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు బయటకు వచ్చిందని, ఈ ప్రక్రియలో తలెత్తిన అనుమానాలు, ఆ మార్పులకు చట్టపరమైన ఆధారం ఏమిటి? అనే విషయాలను ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని ఆయాన అన్నారు. ఫారం-6లో చేసిన మార్పులపై ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఎన్నికల సంఘం దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఓటర్ల డేటాలో మార్పులు చేసే విధానం ఉంటే, క్షేత్రస్థాయిలో చట్టబద్ధమైన అధికారాలు కలిగిన Electoral Registration Officers (EROs) పాత్ర, వారి పర్యవేక్షణ, బాధ్యత ఏమిటో ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని, ఓటర్ల డేటా ఎవరు మార్చారు? ఎప్పుడు మార్చారు? ఏ కారణంతో మార్చారు? ఏ అధికారి అనుమతితో మార్చారు? అనే వివరాలకు ఆడిట్ ట్రయల్ ఉండాలని, అత్యంత బాధ్యత యుతంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. SIR ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడినట్లు నివేదికలు వెలువడ్డాయని, పేర్ల తొలగింపునకు కారణాలు ఏమిటి, ఎంత మంది పేర్లు తొలగించారు? ఎంతమంది అభ్యంతరాలు తెలిపారు? ఎన్ని పేర్లు తిరిగి చేర్చారు? అనే పూర్తి వివరాలను రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం బహిరంగపరచాలని పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల సంఘం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తకుండా, ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, పారదర్శకంగా, జవాబు దారీతనంతో ఉండేలా చూడాలని ఆయన అన్నారు. ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా పొరపాటున తొలగించకుండా చూడటం ఎంత ముఖ్యమో, అనర్హమైన పేర్ల విషయంలో చట్టం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని, అందువల్ల ఓటర్ల జాబితా తయారీ, సవరణ, పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, డేటా మార్పులు వంటి ప్రతి దశలో పకడ్బందీగా ఉండాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి ఎన్నికల సంఘం చర్యలను అనుమానిస్తున్నదని ఇప్పుడు ఇద్దరు కమిషనర్లు కూడా అవే అనుమానాలు వ్యక్తం చేయడంతో దేశంలో ఈ.సి కొంత కాలంగా చేసిన చర్యలు కేంద్రంలోని అధికార పార్టీకి లాభం చేకూర్చిందన్న అనుమానాలు మరింత బలపడ్డాయని అన్నారు. ఈ అంశాలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన, ఉద్యమాలకు ప్రజాస్వామ్య వాదులు, సంఘాలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు.

22-ఏ సమస్యలపై ప్రజలకు వరుసగా ఉపశమన నిర్ణయాలు

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 24:

దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 22-ఏ సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఈ నెల 16న శాసనసభలో ఇచ్చిన హామీ మేరకు సహచర మంత్రులతో చర్చించి 22-ఏ సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించిందని చెప్పారు.

ప్రభుత్వ అనుమతులున్న ఆస్తులకు రిజిస్ట్రేషన్లకు మార్గం

22 ఏ లో ఉన్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ సంస్థల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు, ఫ్లాట్లకు నిర్దేశిత నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పిస్తూ రెవెన్యూ శాఖ ఈరోజు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పురపాలక సంస్థలు, డీటీసీపీ లేదా ఇతర పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే లేఅవుట్, భవన నిర్మాణం లేదా అపార్ట్‌మెంట్ అనుమతులు పొందిన ఆస్తులకు ఈ నిర్ణయం వర్తిస్తుందని చెప్పారు.

అనుమతి పొందిన అనంతరం జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ తప్పనిసరిగా దరఖాస్తుదారులు సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారానికి కమిటీ

ఈ ప్రక్రియలో ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా రిజిస్ట్రార్, హెచ్ఎండీఏ/పురపాలక సంస్థ/గ్రామీణ స్థానిక సంస్థల ప్రతినిధి సభ్యులుగా ఉంటారని తెలిపారు. 22-ఏ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇప్పటికే అమలులోకి వచ్చిన నిర్ణయాలే నిదర్శనమని మంత్రి తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లోని దాదాపు 64 కాలనీల ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యకు జీవో 118కు అనుగుణంగా మెమో జారీ, దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి కార్మికుల ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యను కూడా ప్రభుత్వం జీవో 76 ద్వారా పరిష్కరించే దిశగా కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. భూమి, ఇల్లు వంటి అంశాల్లో ప్రజలు సంవత్సరాల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితికి ముగింపు పలకడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపశమనం కలిగేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. 22-ఏలోని అన్ని భూములను ఒకే గాటన కట్టకుండా, భూమి స్వభావం, అందుబాటులో ఉన్న రికార్డులు, చట్టబద్ధమైన అనుమతులు, న్యాయపరమైన అంశాలను పరిశీలించి అర్హమైన సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని మంత్రి స్పష్టం చేశారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, వెలుతురు, సెప్టెంబర్ 24:

తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద రెండోసారి బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్‌లోని బుద్ధ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. మరోసారి తనకు అవకాశం కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలకు మహిళా కమిషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మహిళలు, విద్యార్థినులు ఎలాంటి సమస్య ఎదురైనా అధైర్యపడాల్సిన అవసరం లేదని, వారికి అండగా నిలిచేందుకు కమిషన్ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి ఇంటి మహిళకు "మన కోసం మహిళా కమిషన్ ఉంది" అనే ధైర్యాన్ని కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని నేరెళ్ల శారద పేర్కొన్నారు. విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతామని, వారికి తల్లిలా ఆదరణ, సహకారం అందిస్తూ అన్ని వేళలా తోడుగా ఉంటామని తెలిపారు. మహిళల హక్కులు, భద్రత, సంక్షేమం కోసం మహిళా కమిషన్ మరింత చురుగ్గా పనిచేస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అభిమానులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆయిల్ పామ్ రైతుల నోట్లో మట్టి కొట్టేలా కేంద్ర నిర్ణయం : మంత్రి తుమ్మల

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ముడి పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయంపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు దేశంలో ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని, రైతులను ఈ పంట వైపు మళ్లించాలని రాష్ట్రాలకు సూచిస్తూ.. మరోవైపు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్‌పై సుంకాన్ని తగ్గించడం కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనమని మంత్రి మండిపడ్డారు."రైతును ఆయిల్ పామ్ సాగు చేయమని ప్రోత్సహిస్తారు.. కానీ రైతు పండించిన గెలలకు గిట్టుబాటు ధర వచ్చే పరిస్థితులను మాత్రం కేంద్రం దెబ్బతీస్తోంది. ఒక చేత్తో రైతును ఆయిల్ పామ్ వైపు నడిపిస్తూ.. మరో చేత్తో దిగుమతి సుంకం తగ్గించి విదేశీ పామాయిల్‌కు మార్కెట్‌ను సులభతరం చేయడం ఏ విధమైన రైతు అనుకూల విధానం?" అని మంత్రి ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో క్రూడ్ పామ్ ఆయిల్‌పై మొత్తం దిగుమతి సుంకం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గింది. దీంతో దిగుమతి చేసుకునే పామాయిల్‌కు పోటీ ప్రయోజనం పెరిగి, దేశీయంగా ఆయిల్ పామ్ గెలల ధరలపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. "తెలంగాణ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి దిగుమతి సుంకాన్ని పెంచాలని కోరుతున్న సమయంలో కేంద్రం సుంకాన్ని తగ్గించడం బాధ్యతారాహిత్యమైన నిర్ణయం. రైతులకు ధర భరోసా కల్పించాల్సిన సమయంలో విదేశీ దిగుమతులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా కేంద్రం ఎవరికి ప్రయోజనం కల్పించాలనుకుంటోంది?" అని తుమ్మల ప్రశ్నించారు.ఆయిల్ పామ్ అనేది సాధారణంగా ఒక సీజన్‌లో పండించి విక్రయించే పంట కాదని, రైతు సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టి, నీరు, ఎరువులు, నిర్వహణ ఖర్చులు భరిస్తూ సాగు చేసే దీర్ఘకాలిక పంట అని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పంటకు మార్కెట్ ధరపై విధానపరమైన స్థిరత్వం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు."ఈరోజు మొక్క నాటిన రైతు రేపే పంట అమ్మడు. సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టిన తర్వాత మార్కెట్ విధానాలను మార్చేస్తే నష్టపోయేది రైతే. రైతుకు ధర భరోసా ఇవ్వకుండా, దిగుమతులకు తలుపులు మరింత విస్తరించడం రైతు ప్రయోజనాలకు విరుద్ధం" అని మంత్రి స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును రాష్ట్రంలో పెద్ద ఎత్తున విస్తరిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో 88 వేలకుపైగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని, దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు.రైతులను ఆయిల్ పామ్ వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీలు, నాట్ల విస్తరణ, డ్రిప్ ఇరిగేషన్, మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, రిఫైనరీలు వంటి అనేక చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా NMEO-OP ద్వారా దేశీయ ఆయిల్ పామ్ ఉత్పత్తిని పెంచి, వంట నూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రకటించింది."కేంద్రం ప్రకటించే లక్ష్యాలు ఒకలా.. అమలు చేసే విధానాలు మరోలా ఉంటే రైతు ఎలా నమ్మకం పెంచుకుంటాడు? ఆయిల్ పామ్ సాగు విస్తరణ కోసం రాష్ట్రాలు, రైతులు పెట్టుబడులు పెట్టిన తర్వాత దిగుమతి సుంకం వంటి కీలక విధానాలను మార్చడం వల్ల రైతుల్లో నమ్మకం దెబ్బతింటుంది" అని తుమ్మల అన్నారు.ఆయిల్ పామ్ రైతుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన తాజా ఆయిల్ పామ్ గెలలకు (FFB) టన్నుకు రూ.25,000 కనీస హామీ ధర కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో FFB ధర ప్రభుత్వం నిర్ణయించే విధానం ప్రకారం అమలవుతోందని, రైతులకు మరింత స్థిరమైన ధర భరోసా అవసరమని పేర్కొన్నారు."రైతు ఆదాయం పెంచుతామని చెప్పే కేంద్ర ప్రభుత్వం ముందుగా రైతు పండించిన పంటకు ధర భరోసా కల్పించాలి. విదేశీ దిగుమతులపై ఆధారపడే విధానాన్ని ప్రోత్సహిస్తూ దేశీయ రైతు ఉత్పత్తికి ధర లేకుండా చేయడం ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తికే విరుద్ధం" అని మంత్రి అన్నారు.భారత్ తన వంట నూనెల అవసరాల్లో పెద్ద భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటున్న

నేపథ్యంలో, దేశీయ ఆయిల్ పామ్ సాగును బలోపేతం చేయడం కేవలం రైతు సంక్షేమానికే కాకుండా దేశ ఆహార, వ్యవసాయ భద్రతకు కూడా కీలకమని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ తన వెజిటబుల్ ఆయిల్ అవసరాల్లో సుమారు మూడింట రెండొంతులు దిగుమతులపై ఆధారపడుతున్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి."ఆత్మనిర్భర్ భారత్ అంటే విదేశీ దిగుమతులపై ఆధారపడటం కాదు.. దేశ రైతు ఉత్పత్తి చేసే నూనెను పెంచడం. రైతును బలోపేతం చేయకుండా దిగుమతులను చౌక చేయడం ద్వారా దేశం ఆత్మనిర్భర్ కాదు. దేశీయ రైతు నిలబడితేనే దేశం నిలబడుతుంది" అని తుమ్మల స్పష్టం చేశారు.తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్రం సహకరించాల్సింది పోయి, రైతుల్లో అనిశ్చితి కలిగించే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. "తెలంగాణ రైతులు నమ్మకంతో ఆయిల్ పామ్ సాగులోకి వచ్చారు. ఆ నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. రైతు ప్రయోజనాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం రాజీ పడదు. కేంద్రం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించి, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించే విధానాన్ని తీసుకురావాలి" మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయా న్ని తక్షణమే పునఃసమీక్షించాలని, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు ధర భరోసా కల్పించేలా కేంద్రం స్పష్టమైన విధా నాన్ని ప్రకటించాలని, లేని పక్షంలో FFBలకు టన్నుకు రూ.25,000 కనీస హామీ ధర కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణ ఏరోస్పేస్, రక్షణ రంగాల సత్తాను చాటనున్న 'రక్షా ఎక్స్‌పో 2026'

న్యూఢిల్లీ, వెలుతురు సెప్టెంబర్ 24:

ఈ వేదిక వెండార్ల అభివృద్ధికి, సాంకేతిక భాగస్వామ్యాలకు మరియు భారతీయ సరఫరాదారులను దేశీయ, అంతర్జాతీయ సప్లై చైన్‌లలో అనుసంధానించడానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.తెలంగాణలో తయారీ కేంద్రాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు , ప్రత్యేక ఇంజనీరింగ్ టెస్ట్ బెడ్‌లు, జాయింట్ వెంచర్ల ఏర్పాటుకు భారతీయ సరఫరాదారులను ఎంపిక చేసుకోవాలని గ్లోబల్ కంపెనీలను ప్రోత్సహించనున్నట్లు స్పష్టం చేశారు. పాల్గొనే కంపెనీలకు, కాబోయే వ్యాపార భాగస్వాములకు మధ్య ముందే నిర్ధారించిన సమావేశాలను ఏర్పాటు చేయడానికి మిలిటరీ అటాచ్‌లు, కౌన్సులర్ ట్రేడ్ ఆఫీసులు కూడా సహకరిస్తాయని వివరించారు.రక్షా ఎక్స్‌పో 2026 లో ప్రత్యేకంగా ఏరోస్పేస్, డిఫెన్స్ అండ్ స్పేస్ కాంక్లేవ్, అధునాతన సాంకేతిక ప్రదర్శన, ఎయిర్ షో మరియు లైవ్ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కంపెనీలు తమ డ్రోన్లు, కౌంటర్-డ్రోన్ సిస్టమ్స్, అటానమస్ ప్లాట్‌ఫారమ్‌లు మరియు ల్యాండ్-బేస్డ్ రక్షణ పరికరాలను ప్రదర్శించవచ్చని అన్నారు. వివిధ దేశాలకు చెందిన పెవిలియన్‌లతో పాటు, భారతీయ ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక టెక్నాలజీ జోన్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.గ్లోబల్ కంపెనీలు తమ సీనియర్ లీడర్‌షిప్, ప్రొక్యూర్‌మెంట్ హెడ్‌లు మరియు సోర్సింగ్ బృందాలను ఈ సమ్మిట్‌కు పంపాలని ప్రధాన కార్యదర్శి ఆహ్వానించారు. ఎగ్జిబిషన్ స్పేస్‌ను బుక్ చేసుకోవాలని, తమ సామర్థ్యాలను ప్రదర్శించాలని, బీ2బీ సెషన్లలో పాల్గొనాలని మరియు పెట్టుబడి దారులు, సోర్సింగ్ భాగస్వామ్యాలు, అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఈ సమ్మిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ ప్రసంగంలో, 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఏరోస్పేస్ మరియు రక్షణ రంగ ఎగుమతులలో సాధించిన 103 శాతం వృద్ధిని, అలాగే వ్యూహాత్మక పరిశోధనా సంస్థలు, డిఫెన్స్ పీఎస్‌యూలు మరియు దాదాపు 1,500 నుండి 2,000 ప్రెసిషన్-ఇంజనీరింగ్ ఎంఎస్ఎంఈలతో కూడిన బలమైన పర్యావరణ వ్యవస్థను ప్రధాన కార్యదర్శి హైలైట్ చేశారు. డ్రోన్లు, కౌంటర్-డ్రోన్ సిస్టమ్స్, ఏవియానిక్స్, అధునాతన మెటీరియల్స్, ప్రొపల్షన్, స్పేస్ టెక్నాలజీస్ మరియు ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ రంగాలలో రాష్ట్రం తన సామర్థ్యాలను విస్తరిస్తోందని ఆయన

తెలిపారు.ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 కు హాజరుకావాల్సిందిగా మరియు రక్షా ఎక్స్‌పో 2026 ను ప్రారంభించాల్సిందిగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి వ్యక్తిగతంగా ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేశారు. ఏరోస్పేస్ మరియు రక్షణ రంగాలలో సోర్సింగ్ భాగస్వామ్యాలు, సాంకేతిక సహకారం, పెట్టుబడులు మరియు దీర్ఘకాలిక వ్యాపార సంబంధాలను సులభతరం చేసే ఫలితాధారిత పారిశ్రామిక వేదికగా రక్షా ఎక్స్‌పోను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ప్రధాన కార్యదర్శి సంజయ్ జజు పేర్కొన్నారు.

ఈ నెల 30న సీఎం చేతుల మీదుగా పండుగ వాతావరణంలో కలెక్టరేట్ ప్రారంభోత్సవం

- **రాష్ట్ర రవాణా సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

కరీంనగర్, వెలుతురు సెప్టెంబర్ 24:

కరీంనగర్ జిల్లా నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఈనెల 30న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పండుగ వాతావరణంలో ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారంతో పాటు కార్యాలయ భవనాన్ని సుందరంగా అలంకరించాలని, స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా భవనం పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. ప్రధాన ద్వారం, కలెక్టర్ కార్యాలయం, ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలతో పాటు ఇతర ముఖ్య ప్రాంగణాలను సుందరంగా అలంకరించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి ప్రారంభోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించే లా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రతి ప్రాంతంలో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ప్రాంగణం పరిశీలన

సమీక్ష అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఏర్పాటు చేస్తున్న ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై కూడా చర్చించారు. కలెక్టర్ నూతన ఛాంబర్, సమావేశ మందిరంతో పాటు ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక కోసం నూతనంగా నిర్మించిన హెలిప్యాడ్‌ను కూడా మంత్రి పరిశీలించారు. హెలిప్యాడ్‌కు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో చేరుకున్న తర్వాత కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం నూతన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు.ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిల, ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు ప్రదానం

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ - 2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026 (ఉత్తమ ప్రజా సేవకుడు) అవార్డుకు ఎంపికయ్యారు. కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కా రాన్ని అందజేస్తోంది. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టి గల నాయకత్వానికి గానూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ప్రజాస్వామిక విలువలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను ఈ సందర్భంగా జ్యూరీ ప్రత్యేకంగా కొనియాడింది.ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకుఅవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్, ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేస్తారు. ఆర్యదాన్ ముహమ్మద్ కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత. 8 సార్లు ఎమ్మెల్యేగా, కేరళలోని వివిధ మంత్రివర్గాల్లో నాలుగు సార్లు వివిధ శాఖలకు మంత్రిగా సేవలు అందించారు.

రాజనీతిజ్ఞుడైన ఆర్యదాన్ ముహమ్మద్ దూరదృష్టి గల నేతగా, అద్భుతమైన పార్లమెంటేరియన్ గా, సమర్థుడైన పాలకునిగా, కార్మిక వర్గ ఛాంపియన్‌గా కేరళ ప్రజల మదిలో నిలిచిపోయారు.

నిజాయితీ, లౌకిక విలువలు, ప్రజా సంక్షేమ పాలనకు మారుపేరుగా ఆర్యదాన్ ముహమ్మద్ గుర్తింపు పొందారు.

VELTHURU TELUGU DAILY

వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ :శుక్రవారం 25.09.2026

సంపుటి : 09 సంచిక : 104, పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా రెండవసారి బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారదను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ, సాధికారత కోసం మహిళా కమిషన్ ద్వారా నేరెళ్ల శారద మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

'సర్' పై అనుమానాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం..

- ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలి
- మా ఆరోపణలకు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలు బలం చేకూరుస్తున్నాయి..
- ఎన్నికల సంఘం పనులు అత్యంత పారదర్శకంగా ఉండాలి.. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్....
- ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా 28న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు...

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న మొదటి నుచి అనేక అనుమానాలకు తావిస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు.. ఎన్నికల సంఘం ప్రవర్తిస్తున్న తీరుకు నిదసనగా ఏఐసీసీ పిలుపు మేరకు ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ విషయాలపై ఆయన ఈ రోజు ఒక ప్రకటన చేస్తూ ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి పౌరుడికి హక్కు అని పౌరుల హక్కులను కాపాడడం ఎన్నికల సంఘం కనీస బాధ్యత అని అన్నారు.

▶ మిగతా2లో

ఆయిల్ పామ్ రైతుల నోట్లో మట్టి కొట్టేలా కేంద్ర నిర్ణయం : మంత్రి తుమ్మల

- రైతులను ఆయిల్ పామ్ వైపు ప్రోత్సహిస్తూ.. అదే రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధానాలు ఎందుకు?
- దిగుమతి సుంకం తగ్గింపుతో దేశీయ ఆయిల్ పామ్ రైతులకు ధరలపై ఒత్తిడి పడే అవకాశం
- రాష్ట్రం 44 శాతం దిగుమతి సుంకం కోరుతుంటే.. కేంద్రం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గించింది
- కేంద్ర నిర్ణయం ఆయిల్ పామ్ రైతుల్లో అనిశ్చితిని పెంచే అవకాశం
- దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే పునరాలోచించాలి
- రైతులను ఆయిల్ పామ్ వైపు మళ్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు కేంద్ర దిగుమతి సుంకం తగ్గింపు ప్రతికూలంగా మారే అవకాశం

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

ఉద్యమానికి ముందు బీఆర్ఎస్ నేతల ఆస్తులు ఎంత ? ఇప్పుడు ఎంత?

- కల్వకుంట్ల కుటుంబానికి 450 ఎకరాల భూమి ఎలా వచ్చింది
- బీఆర్ఎస్ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలి
- ఆస్తులపై సమాధానం చెప్పకుండా జైపూర్ పవర్ ప్లాంట్ వద్ద ధర్నా ఎందుకు?
- ప్రజల దృష్టి మరల్చేందుకే ధర్నాల పేరుతో బీఆర్ఎస్ డ్రామాలు
- చెన్నూరులో విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు పెద్దపీట వేస్తున్నాం

- శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

జైపూర్, వెలుతురు సెప్టెంబర్ 24:

22-ఏ సమస్యలపై ప్రజలకు వరుసగా ఉపశమన నిర్ణయాలు

- జీవో 118, జీవో 76 తర్వాత మరో కీలక నిర్ణయం
- 22-Aలో ఉన్నా.. GHMC, HMDA, DTCP, మున్సిపల్ అనుమతులున్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్లరిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం
- తక్షణమే రిజిస్ట్రేషన్ చేసేలా ఉత్తర్వులు జారీ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు 22-ఏ సమస్యలకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారాలు

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 24:

వైఎస్ షర్మిల కుమార్తె అంజిలి-రఘు లను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24: కొత్వాల్ గూడలో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కుమార్తె అంజిలి-రఘు నిశ్చితార్థ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు, కాబోయే వధూవరులను ఆశీర్వదించిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

2030 నాటికి పేదరిక నిర్మూలన..

- 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- రాష్ట్ర అభివృద్ధి కార్యాచరణకు వేగం పెంచే దిశగా కీలక నిర్ణయాలు
- TSDPS బలోపేతం.. ప్రత్యేక PMU ఏర్పాటు
- జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్‌కు రూపకల్పన
- ప్రభుత్వం—GFST భాగస్వామ్యానికి ప్రతిపాదన

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 24:

తెలంగాణ ఏరోస్పేస్, రక్షణ రంగాల సత్తాను చాటనున్న 'రక్షా ఎక్స్‌పో 2026'

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

న్యూఢిల్లీ, వెలుతురు సెప్టెంబర్ 24: డిసెంబర్ 7 నుండి 9 వరకు హైదరాబాద్ లోని 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'రక్షా ఎక్స్‌పో 2026'ను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జజు గురువారం ప్రకటించారు. న్యూఢిల్లీలో జరిగిన 'న్యూస్18 డిఫ్‌కాన్ 2026' సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. ప్రపంచ స్థాయి ఏరోస్పేస్, రక్షణ రంగ కంపెనీలు, భారతీయ తయారీదారులు, ఎంఎస్ ఎంఈలు, స్టార్టప్‌లు, టెక్నాలజీ డెవలపర్లు ఈ ఎక్స్‌పోలో పాల్గొని తెలంగాణలో ఉన్న అవకాశాలను అన్వేషించాలని ఆహ్వానించారు.

ఈ ఎక్స్‌పో ప్రధానంగా వ్యాపార వృద్ధిపై దృష్టి పెట్టనుంది. గ్లోబల్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు, భారతీయ కంపెనీలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, ప్రొక్యూర్‌మెంట్ బృందాల మధ్య ప్రత్యేకంగా బిజినెస్-టు-బిజినెస్ (బీ2బీ) సమావేశాలు, ప్రత్యక్ష చర్చలు జరుగుతాయని తెలిపారు.

నేడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు ప్రదానం

- బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026కు సీఎం ఎంపిక
- కేరళ నిలంబూరులో అవార్డు ప్రదానోత్సవం
- రైతు, బీసీ, ప్రజా సంక్షేమ పాలనకు గుర్తింపు

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

కొత్వాల్ గూడలో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కుమార్తె అంజిలి-రఘు నిశ్చితార్థ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, cwc సభ్యులు గిడుగు రుద్రరాజు, మాజీ మంత్రి రఘువీరా రెడ్డి

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

ఫిరాయింపు రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

- అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ హెల్త్ ఫెసిలిటీల్లో ఫైర్ సేఫ్టీ ఆడిట్‌పై అధికారులతో చర్చ

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం రాజ్యాంగ విజయం

- ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ బిజెఎల్పి తెలంగాణ

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద బాధ్యతల స్వీకరణ

- మహిళలు, విద్యార్థినులకు అండగా మహిళా కమిషన్
- ప్రతి ఇంటి మహిళకు కమిషన్ ఉందనే ధైర్యం కల్పించడమే లక్ష్యం

హైదరాబాద్, వెలుతురు, సెప్టెంబర్ 24:

కరెంటు సంక్షోభానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం: కొప్పుల ఈశ్వర్

- సింగరేణి హెడ్ఆఫీస్ వద్ద బీఆర్ఎస్ నేతల ధర్నా
- విద్యుత్ కోతలు, సింగరేణి బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీసిన నేతలు

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 24: రాష్ట్రంలో విద్యుత్ కోతలు, విద్యుత్ రంగంలో నెలకొన్న పరిస్థితులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసనలో భాగంగా గురువారం హైదరాబాద్ లోని సింగరేణి హెడ్ఆఫీస్ వద్ద ఆ పార్టీ నేతలు ధర్నా నిర్వహించారు.

▶ మిగతా8లో

ఈ నెల 30న సీఎం చేతుల మీదుగా పండుగ వాతావరణంలో కలెక్టరేట్ ప్రారంభోత్సవం..

- పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి..
- ప్రధాన ద్వారం నుంచి కలెక్టరేట్ కార్యాలయం సుందరంగా ముస్తాబు చేయాలి..
- సీఎం పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి..

- అన్ని శాఖలు సమన్వయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలి..

కరీంనగర్, వెలుతురు సెప్టెంబర్ 24:

తెలంగాణ కమలదళంలో ప్రకంపనలు: మొదలైన 'మిషన్ 2028'

పనిచేసే కార్యకర్తలకు పండుగ... పదవుల కోసం తిరిగే దొంగలకు వణుకు!

సార్వత్రిక ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉందనగానే, తెలంగాణ బీజేపీలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారం దిశగా అడుగులు వేయడానికి అధిష్టానం ఢిల్లీ నుంచి సంధించిన బ్రహ్మాస్త్రం పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. నితిన్ నబిన్ గారి పర్యవేక్షణలో రాష్ట్ర ఇంచార్జిగా సునీల్ బాన్సల్ , సహ ఇంచార్జిలుగా అభయ్ పాటిల్ , రేఖ శర్మలను నియామకంతో తెలంగాణ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారబోతోంది. ఇది కేవలం నాయకత్వ మార్పు కాదు, కిందిస్థాయి నుండి పార్టీని ప్రక్షాళన చేసే ఒక సర్జికల్ స్ట్రైక్!

వ్యూహకర్త సునీల్ బన్సాల్:

ప్రత్యర్థుల కోటలు బద్దలు కొట్టే 'సైలెంట్ ఎలక్షన్ ఇంజనీర్'

పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ లాంటి మహా సముద్రాల్లాంటి రాష్ట్రాల్లో బీజేపీని ఒంటిచేత్తో అధికార తీరాలకు చేర్చిన అసలు సిసలైన చాణక్యుడు సునీల్ బన్సాల్. ఆయన వ్యూహాలు పేపర్ల మీద ఉండవు, నేరుగా గ్రౌండ్ జీరోలో అమలవుతాయి. బూత్ స్థాయి మేనేజ్‌మెంట్‌లో ఆయనొక మాస్టర్ మైండ్. ఇప్పుడు ఆయన దృష్టంతా తెలంగాణపైనే పడింది. రాబోయే రెండేళ్లలో ఆయన వేసే ఎత్తుగడలు రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టించడం ఖాయం. పార్టీ వార్ రూమ్ ఇక నిద్రపోదు, ప్రత్యర్థులకు నిద్ర పట్టనివ్వదు!

అభయ్ పాటిల్:

మాటల గారడీలు నడవవు.. 'మినిట్ బుక్' మాట్లాడాలి!

సహ ఇంచార్జి అభయ్ పాటిల్ గారు రంగంలోకి దిగారంటే, ఇక మైకుల ముందు చేసే హడావిడి పనిచేయదు. ఆయనకు కావాల్సింది రిజల్ట్! 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కరీంనగర్‌లో జరిగిన ఒక్క సంఘటన చాలు ఆయన పనితీరు అర్థం కావడానికి. "అన్ని మీటింగ్లు పెట్టాం, జనాల్లోకి వెళ్లాం" అని కలరింగ్ ఇచ్చిన ఒక మండల అధ్యక్షుడితో ఆయన రాజీ పడలేదు. "ఎన్ని మీటింగులు పెట్టావో కాదు, పార్టీ 'మినిట్ బుక్' తీసుకురా... నువ్వు తెచ్చేదాకా నేను ఇక్కడే కూర్చుంటా"

అని ఆయన పట్టుబట్టిన తీరు అక్కడున్న నాయకులకు చెమటలు పట్టించింది. నివేదికలు లేకుండా గాలిమాటలు చెబితే ఆయన దగ్గర ఆటలు సాగవు. కష్టపడి పనిచేసే సామాన్య కార్యకర్తలకు ఆయన ఒక ఆశాకిరణం, కానీ పార్టీ పేరు చెప్పుకుని తిరిగే రాజకీయ పర్యాటకులకు ఆయన ఒక సింహస్వప్నం. ఇలాంటి నాయకుడి వల్లనే క్షేత్రస్థాయిలో పార్టీకి గుండె బలం వస్తుంది!

రేఖ శర్మ:

ఫోటో పోజులకు చెక్...

ఉదాసీనతపై ఉక్కుపాదం!

మరో సహ ఇంచార్జి రేఖ శర్మ ఎంట్రీతో పార్టీలో సోమరితనానికి కౌంట్ డౌన్ మొదలైంది. గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఆమె రాష్ట్రానికి వచ్చినప్పుడు, కేవలం ఫోటో షూట్లకు పరిమితమయ్యే నేతల్లో తీవ్ర అలజడి రేగింది. "పార్టీ కార్యాలయానికి వచ్చామా, ప్రెస్ మీట్ పెట్టామా, వెళ్లామా" అన్నట్లుగా వ్యవహరించే సోకాల్డ్ నేతలకు ఆమె పర్యటనలు చుక్కలు చూపించాయి. బాధ్యతారాహిత్యాన్ని ఏమాత్రం సహించని ఆమె వైఖరి, కిందిస్థాయి వ్యవస్థను పరుగులు పెట్టిస్తోంది.

అసలైన ఆట ఇప్పుడే మొదలైంది!

గతం వేరు, వర్తమానం వేరు... రాబోయే రెండేళ్లు తెలంగాణ బీజేపీలో ఎవరూ ఊహించని మార్పులు జరగబోతున్నాయి. ఒకవైపు బన్సాల్ మాస్టర్ ప్లాన్స్, మరోవైపు అభయ్ పాటిల్, రేఖ శర్మల కఠినమైన అకౌంటబిలిటీ... ఈ త్రయం దెబ్బకు పార్టీ సంస్థాగత నిర్మాణం ఉక్కులా తయారవ్వడం ఖాయం.పదవులు అనుభవించి పడుకునే కాలం పోయింది...

కష్టపడి పనిచేసేవాడికే ఇక పట్టాభిషేకం! అధికారమే ఏకైక లక్ష్యంగా దూసుకుపోతున్న

ఈ కొత్త నాయకత్వం తెలంగాణలో సృష్టించబోయే సంచలనాలు చూడాలంటే కొద్దిరోజులు వేచి చూడాల్సిందే!

ఆరోగ్యానికి అసలు మంత్రం: ఏమి? ఎంత? ఎప్పుడు?

(సెప్టెంబర్ 23వ తేదీన11వ ఆయుర్వేద దినోత్సవ సందర్భంగా ఆసక్తికరమైన వ్యాసం)

వేల ఏళ్ల ఆయుర్వేద జ్ఞానం నుంచి ఆధునిక జీవచక్ర శాస్త్రం వరకు —— ఆహా రం, సమయం, మితాహారం, జీవనశైలి మన ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి?

రచన:

డా. రావణవేణి ప్రభాకర్, యం.డి. (ఆయుర్వేద)

ఆయుర్వేద వైద్య నిపుణులు

మనిషి ఆరోగ్యంగా ఉండటానికి ఏమి చేయాలి? ఈ ప్రశ్నకు సమాధానం కోసం మానవజాతి అనాదిగా అన్వేషిస్తూనే ఉంది. ఆధునిక వైద్యం శాస్త్రీయ పరిశోధనలు, ప్రయోగాలు, క్లినికల్ అధ్యయనాల ద్వారా ఆరో గ్యానికి సంబంధించిన అనేక విషయాలను వెలుగులోకి తెచ్చింది. అయితే, ఆహారం, ఆహార పరిమాణం, భోజన సమయం, జీవనశైలి, ఇంద్రియ నియంత్రణ వంటి అంశాలకు ఆయుర్వేదం వేల సంవత్సరాల క్రితమే ప్రాధాన్యత ఇచ్చింది. చరక సంహితలోని ఒక ముఖ్యమైన శ్లోకం ఈ విషయాన్ని ఎంతో సంక్షిప్తంగా వివరిస్తుంది:

హితాశీ స్యాన్మితాశీ స్యాత్ కాలభోజీ జితేంద్రియః ।

పశ్యన్ రోగాన్ బహూన్ కష్టాన్ బుద్ధిమాన్ విషమాశనాత్ ॥

- చరక సంహిత, నిదానస్థానం 6/11

శ్లోక భావం

హితమైన ఆహారం తీసుకోవాలి, మితంగా తినాలి, తగిన సమయంలో భోజనం చేయాలి, ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి. అనుచితమైన ఆహారపు అలవాట్ల వల్ల అనేక కష్టమైన వ్యాధులు కలుగుతాయని గ్రహిం చిన వివేకి ఈ నియమాలను పాటించాలి. ఈ ఒక్క శ్లోకంలోనే ఆరోగ్యకరమైన జీవన విధానానికి సంబంధించిన నాలుగు ముఖ్యమైన అంశాలు కనిపిస్తాయి:

- హితాశీ —— ఏమి తినాలి?
- మితాశీ —— ఎంత తినాలి?
- కాలభోజీ —— ఎప్పుడు తినాలి?
- జితేంద్రియః —— కోరికలను, ఇంద్రియాలను ఎలా నియంత్రించాలి?

'ఏమి తింటున్నాం?' నుంచి 'ఎప్పుడు తింటున్నాం?' వరకు పోషకాహారం

గురించి మాట్లాడేటప్పుడు ఇప్పటివరకు మన దృష్టి ప్రధానంగా రెండు ప్రశ్నలపైనే ఉండేది:

ఏమి తినాలి? ఎంత తినాలి?

అయితే ఆధునిక పరిశోధనలు మరో ప్రశ్నకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నాయి: "ఎప్పుడు తినాలి?"

మన శరీరంలో సుమారు 24 గంటల జీవ గడియారం ఉంటుంది. దీనిని జీవచక్రం అంటారు. మెదడులోని ప్రధాన జీవ గడియారంతో పాటు కాలేయం, క్లోమం, కండరాలు, కొవ్వు కణజాలం వంటి అనేక అవయవాల్లోనూ జీవ గడియారాలు ఉంటాయి.ఇవి నిద్ర, మెలటోనిన్, కార్టిసాల్, ఇన్సులిన్, గ్లూకోజ్ నియంత్రణ వంటి అనేక శారీరక ప్రక్రియలను ప్రభావితం చేస్తాయి.సాధారణంగా పగటి సమయంలో శరీరం ఇన్సులిన్‌కు మెరుగ్గా స్పందిస్తుంది. సాయంత్రం, రాత్రి సమయాల్లో గ్లూకోజ్‌ను నిర్వహించే సామర్థ్యం కొంత తగ్గవచ్చు.అందువల్ల ఒకే ఆహారాన్ని ఉదయం తీసుకోవడం, అర్ధరాత్రి తీసుకోవడం శరీరంపై ఒకే విధమైన ప్రభావాన్ని కలిగించకపోవచ్చు.

రాత్రి భోజనం ఎందుకు చర్చనీయాంశంగా మారింది?

రాత్రి సమయంలో శరీరం నిద్రకు సిద్ధమవుతుంది. మెలటోనిన్ స్థాయులు పెరుగుతాయి. జీవక్రియలో పగటి సమయంతో పోలిస్తే కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి.ఇలాంటి సమయంలో పెద్ద మొత్తంలో ఆహారం తీసుకోవడం వల్ల ఆహారం తీసుకునే సమయం, శరీర జీవ గడియారం మధ్య అసమతుల్యత ఏర్పడవచ్చు.రాత్రి షిఫ్టుల్లో పనిచేసే వారిలో నిద్ర, ఆహారం, జీవ గడియారం మధ్య ఏర్పడే అసమతుల్యత ఇన్సులిన్ పట్ల శరీర స్పందనపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని మానవ పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే దీన్ని "రాత్రి తిన్న ప్రతి ఆహారం హానికరం" అనే సరళమైన నియమంగా చేసుకోవడం సరైంది కాదు. వ్యక్తి జీవన విధానం, పని సమయం, నిద్ర, శారీరక శ్రమ, ఆరోగ్య పరిస్థితి వంటి అనేక అంశాలు ఇందులో పాత్ర పోషిస్తాయి.

కాలేయం - శరీరంలోని మరో ముఖ్యమైన 'గడియారం'

మనిషి రాత్రి ఆహారం తీసుకోకపోయినా రక్తంలో గ్లూకోజ్ సరఫరా కొనసాగాలి. ఇందుకోసం కాలేయం కీల కమైన పాత్ర పోషిస్తుంది.కాలేయం నిల్వచేసిన గ్లైకోజెన్‌ను విచ్ఛిన్నం చేసి గ్లూకోజ్‌ను విడుదల చేస్తుంది. అవసరమైనప్పుడు కొత్త గ్లూకోజ్‌ను కూడా తయారు చేస్తుంది. భోజనం చేసిన తర్వాత ఇన్సులిన్ పెరగడంతో కాలేయం నుంచి గ్లూకోజ్ విడుదల తగ్గుతుంది.

సరళంగా చెప్పాలంటే:

భోజనం → ఇన్సులిన్ → గ్లూకోజ్ వినియోగం, నిల్వ అదే ఉపవాసం → కాలేయం → గ్లూకోజ్ సరఫరా

అనే ప్రక్రియలు మన శరీరంలో నిరంతరం మారుతూ ఉంటాయి. అంటే మన శరీరం ఆహారం తీసుకోవడాన్ని కేవలం "ఏమి తిన్నాం?" అనే కోణంలో మాత్రమే చూడదు. "ఎప్పుడు తిన్నాం?" అనే అంశానికీ శారీరక ప్రాధాన్యత ఉంది.

'మితాశీ' అంటే ఆకలితో ఉండటం కాదు ఆయుర్వేదంలోని మితాశీ అనే భావనను కొన్నిసార్లు "తక్కువ తినడం"గా మాత్రమే అర్థం చేసుకుంటాం. కానీ దాని పరిధి అంతకంటే విస్తృతమైనది.మన అవసరానికి, శరీర పరిస్థితికి, జీర్ణశక్తికి తగిన పరిమాణంలో ఆహారం తీసుకోవడం మితాహారం అనే భావనకు దగ్గరగా ఉంటుంది.ఇక్కడే ప్రాచీన జ్ఞానం, ఆధునిక పరిశోధన మధ్య ఒక ఆసక్తికరమైన సంభాషణ ప్రారంభమవుతుంది.

ఆరోగ్యం అంటే వ్యాధి లేకపోవడమేనా?

- అష్టాంగ హృదయంలో మరో అందమైన శ్లోకం ఉంది:
- నిత్యం హితాహారవిహారసేవీ సమీక్ష్యకారీ విషయేష్వసక్తః
- దాతా సమః సత్యపరః క్షమావాన్ ఆప్తోపసేవీ చ భవత్యరోగః
- అష్టాంగ హృదయం, సూత్రస్థానం 4/36

శ్లోక భావం

హితమైన ఆహారం, హితమైన జీవన విధానాన్ని అనుసరించేవాడు; ఆలోచించి కార్యాలు చేసేవాడు, ఇంద్రియ సుఖాలకు అతిగా బానిస కాకుండా ఉండేవాడు, దాతృత్వం, సమత్వం, సత్యం, క్షమ వంటి గుణాలను కలిగి ఉండేవాడు, జ్ఞానుల సాంగత్యాన్ని కోరుకునేవాడు ఆరోగ్యంగా ఉంటాడని ఈ శ్లోకం చెబుతుంది. ఇక్కడ ఆరోగ్యం కేవలం వ్యాధి లేకపోవడం అనే అర్థానికి పరిమితం కాదు. ఆహారం, జీవనశైలి, ఆలోచనా విధానం, ఇంద్రియ నియంత్రణ, సామాజిక సం బంధాలు - ఇవన్నీ ఆరోగ్యకరమైన జీవి తంలో భాగాలుగా పరిగణించబడుతున్నాయి.

ప్రాచీన జ్ఞానం — ఆధునిక పరిశోధన

ఆయుర్వేదం:

- హితాశీ - ఏమి తినాలి
- మితాశీ - ఎంత తినాలి
- కాలభోజీ - ఎప్పుడు తినాలి
- జితేంద్రియః - కోరికలను ఎలా నియంత్రించాలి
- హితవిహార - ఎలా జీవించాలి
- అనే అంశాలకు ప్రాధాన్యతనిచ్చింది.

ఆధునిక శాస్త్రం మరోవైపు:

ఆహార నాణ్యత, శక్తి సమతుల్యత, భోజన సమయం, జీవ గడియారం, నిద్ర, వ్యాయామం, ప్రవర్తనా నియంత్రణ వంటి అంశాలను వివిధ పరిశోధనా పద్ధతులతో అధ్య యనం చేస్తోంది. అయితే ఈ రెండింటినీ "ఒకటే" అని చెప్పడం శాస్త్రీయంగా సరైనది కాదు. ఆయుర్వేదం తన స్వంత వైద్య తత్వం, భావనలు, అనుభవ సంప్ర దా యాల ఆధారంగా ఆరోగ్యాన్ని వివరిస్తుంది. ఆధునిక విజ్ఞా నం మాత్రం ప్రయోగాలు, పరిశీలనా అధ్య యనాలు, శరీర ధర్మ శాస్త్రం, హార్మోన్లు, కణస్థాయి ప్రక్రియలు, పరిశోధనలు వంటి పద్ధతుల ద్వారా విషయాలను పరిశీలిస్తుంది.

అయినప్పటికీ, రెండింటి మధ్య ఒక ఆసక్తికరమైన సామాన్య ప్రశ్న కనిపిస్తుంది:

ఆహారం అంటే కేవలం పదార్థం మాత్రమేనా? లేక దాని పరిమాణం, సమ యం, జీవన విధానం కూడా అంతే ముఖ్యమా?

నేటి జీవితానికి ఈ సందేశం ఎందుకు అవసరం?

నేటి జీవనశైలిలో ఆహారం 24 గంటలూ అందు బాటులో ఉంది. మొబైల్ ఫోన్లు, తెరలు, రాత్రివేళల పని, వినోదం, మారుతున్న పని వేళలు - ఇవన్నీ మన నిద్ర, ఆహార సమయాలను ప్రభావితం చేస్తున్నాయి.అ ర్ధరాత్రి భోజనం, తరచూ అల్పాహారం, అనియమిత నిద్ర వంటి అలవాట్లు చాలామందిలో కనిపిస్తున్నాయి. మనం ఆహారంలోని కేలరీలు, ప్రోటీన్, కొవ్వు, కార్బోహైడ్రేట్ల గురించి ఎంతో చర్చిస్తున్నాం. కానీ మరో ప్రశ్నను కూడా అడగాల్సిన సమయం వచ్చింది:

"ఈ ఆహారాన్ని మనం ఎప్పుడు తీసుకుంటున్నాం?"

శరీరానికి సరైన ఆహారం ఇవ్వడం ఎంత ముఖ్యమో, మన జీవన గడియారానికి అనుగుణంగా ఆహారం తీసుకోవడం కూడా ఆరోగ్య చర్చలో ఒక ముఖ్యమైన అంశంగా మారుతోంది. వయస్సు, ఆరోగ్య పరి స్థితి, పని విధానం, నిద్ర సమయం, శారీరక శ్ర మ, మందులు అంశాలను పరిగణన లోకి తీసుకుని వ్యక్తిగత నిర్ణయం తీసుకోవాలి.

ముగింపు

ప్రాచీన జ్ఞానాన్ని అంధంగా నమ్మాల్సిన అవసరం లేదు.అదే సమయంలో ఆధునిక విజ్ఞానం అభివృద్ధి చెందిందనే కారణంతో పాత జ్ఞాన సంప్రదాయాల్లోని ప్రతి ఆలోచనను విస్మరించాల్సిన అవసరమూ లేదు.ప్రాచీన జ్ఞానం మనకు ప్రశ్నలను ఇచ్చింది.ఆధునిక విజ్ఞానం వాటిని పరిశీలించే, పరీక్షించే సాధనాలను అందించింది. ఈ రెండింటినీ వివేకంతో పరిశీలించినప్పుడు ఆరోగ్యం గురించి మన అవగాహన మరింత సమగ్రంగా మారుతుంది.

- చివరికి ఆరోగ్యకరమైన జీవితం కోసం మనం నాలుగు సాధారణ ప్రశ్నలను మనల్ని మనం అడగవచ్చు:
- ఏమి తింటున్నాం? - హితాన్ని ఎంచుకుంటున్నామా?
- ఎంత తింటున్నాం? - మితాన్ని పాటిస్తున్నామా?
- ఎప్పుడు తింటున్నాం? - శరీర జీవచక్రాన్ని గమనిస్తున్నామా?
- ఎలా జీవిస్తున్నాం? - నియమం, సమతుల్యత, స్వీయ నియంత్రణతో జీవిస్తున్నామా?

ఆరోగ్యం అనేది ఒకే రోజు చేసే ప్రయత్నం కాదు. అది ప్రతిరోజూ తీసుకునే చిన్న చిన్న నిర్ణయాల సమాహారం.

డా. రావణవేణి ప్రభాకర్
యం.డి. (ఆయుర్వేద) ఆయుర్వేద వైద్య నిపుణులు

ఆరుట్లలో శ్రీ మేజర్ పద్మపాని ఆచార్య యూత్ అసోసియేషన్ గణనాథుడి వద్ద అన్నదాన కార్యక్రమం

- అన్నదాన దాతలు కొత్తపల్లి రవి గౌడ్ శేఖర్ గౌడ్
- అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్, ఉపసర్పంచ్ నుకం రాజు ముదిరాజ్, వివిధ పార్టీల నాయకులు

మంచాల వెలుతురు సెప్టెంబర్ 24:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ మేజ ర్ పద్మపాని ఆచార్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ష్టించిన గణనాథుడి మం డపం వద్ద అన్నదాన దాతలు కొత్తపల్లి రవి గౌడ్ శేఖర్ గౌడ్ సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పా టు చేశారు ముందుగా గణ నాథుడికి గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమా ర్ ఉపసర్పంచ్ ను కంరాజు ముదిరాజ్ పాలక మండలి సభ్యులు వివిధ పార్టీల నాయకులతో కలిసి ప్రత్యేకపూజ లు చేశారు ప్రత్యేక పూజలు పాల్గొన్న గ్రామసర్పంచ్ ఉపసర్పంచ్ వివిధ పార్టీల నాయకులను గ్రామపెద్దలను శ్రీ మేజర్ పద్మపాణి ఆచార్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువలతో ఘనంగా సన్మానించారు అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన గ్రామసర్పంచ్ మాని పాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నుకం రాజు ముదిరాజ్ అన్నదాన దాతలు కొత్తపల్లి రవి గౌడ్ శేఖర్ గౌడ్ వివిధ రాజకీయ పార్టీ నాయకులు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ పంచాయతీ వార్డు సభ్యులు మంద మాధవి మోహ న్ రెడ్డి పున్నం రాములా వుల జంగయ్య మహమ్మద్ ఇమ్రాన్ మాదుగుల బాలమణి కృష్ణ గౌడ్ మొగ్రి పద్మ ఐలయ్య లాలాగరి మణెమ్మ సాతిరి సత్యం ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నరసింహగౌడ్ బుట్టి కృష్ణముది రాజ్ శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజు గౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ ప్రజాగలం భూపాల్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షు డు నూకం బాలరాజ్ ముదిరాజ్ గ్రామపెద్దలు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ చిందం రఘుప తి కొత్తపల్లి మహేందర్ గౌడ్ రాజు గౌడ్ గంట నరసింహారెడ్డి రెడ్డి శ్రీ మేజర్ పద్మపాణి ఆచార్య యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో నెరవేరనున్న మినీ స్టేడియం కల

- రెవెన్యూ అధికారులతో కలిసి స్థలం పరిశీలించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం వెలుతురు సెప్టెంబర్ 24:

ఇబ్రహీంపట్నంలో పర్యటించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మినీ స్టేడియం కోసం కావాల్సిన స్థలాన్ని ఇబ్రహీంపట్నం గురునానక్ కళాశాల వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గానికి మినీస్టేడియం ఏర్పాటు దశాబ్దాల కల ఎట్టకే లకు తీరనుంది ఈ మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిగారు స్వయంగా రంగంలోకి దిగి స్థల పరిశీలన చేశారు గురువారం ఇబ్రహీంపట్నంలో జోనల్‌స్థాయి క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి హాజరైన ఆయనకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు క్రీడామైదానం అంశమై విజ్ఞప్తి చేశారు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో రెవెన్యూ అధికారులను అక్కడికి పిలిపించారు కా ర్యక్రమం అనంతరం గురునానక్ కళాశాల ఎదురుగా సర్వేనంబర్ 320లోగల స్థలాన్ని ఆయన పరిశీలించారు ఆరున్నర ఎకరాలు స్టేడియంకు కేటాయింపు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపా లని ఆర్డీవోకు ఎమ్మెల్యే సూచన

లు చేశారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మినీస్టేడియం ఏ ర్పాటు చేసే బాధ్యతతనదని విద్యార్థులకు ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డిఓ శ్రీనివాస్ రెడ్డి ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నా రు.

మహిళా సంఘాలకు అండగా ప్రభుత్వం

గుండాల, సెప్టెంబర్ 24 (వెలుతురు):

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గుండాల మండలంలో 92 మహిళా సంఘాలకు రూ.8.29 కోట్ల వడ్డీలేని రుణాలను గురువారం పంపిణీ చేశారు. రుణాలను వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు వినియోగించి ఆర్థికంగా ఎదగాలని మహిళలకు సూచించారు. మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తనాలు, ఎరువుల షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పథకాల కోసం దళారులను ఆశ్రయించవద్దని, ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వొద్దని సూచించారు. అనంతరం పాచిల్ల గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ

అధికారులు, ఏపీడీఓ, డీఆర్‌డీఏ అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మైనర్ బాలికను రక్షించిన శశికుమార్‌కు సీపీ డాక్టర్ ఎం. రమేశ్ సన్మానం

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

మైనర్ బాలికను ప్రమాదం నుంచి రక్షించి, నిందితుడిని పోలీసులకు అప్పగించిన శశికుమార్‌ను సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేశ్ అభినందించి సన్మానించారు. ఆగస్టు 16న ఓ రెండేళ్ల మైనర్ బాలికపై అత్యాచారానికి ప్రయత్నిస్తున్న వ్యక్తి నుంచి బాలికను శశికుమార్ ధైర్యంగా రక్షించారు. మార్గంలో వెళ్తుండగా బాలిక అరుపులు విని వెంటనే స్పందించిన శశికుమార్, అక్కడికి చేరుకుని బాలికను సురక్షితంగా రక్షించడంతో పాటు నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ ఎం. రమేశ్ శశికుమార్‌ను గంగారం చెరువు వద్దకు పిలిపించి శాలువాతో సత్కరించి అభినందించారు. సమయస్ఫూర్తితో స్పందించి చిన్నారిని రక్షించడం అభినందనీయమని, సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందని సీపీ పేర్కొన్నారు.

శశికుమార్ చూపిన ధైర్యం, మానవత్వం ఇతరులకు స్ఫూర్తిదాయకమని సీపీ తెలిపారు.

గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 24:

కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ గురువారం నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లిలో మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. అదేవిధంగా గాజులరామారం డివిజన్ పరిధిలోని వోక్షిత్ హిల్ వ్యూ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఏర్పాటుచేసిన గణనాథుని దర్శించుకొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ విఘ్నేశ్వరుడు ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గణేష్ మండపాల కమిటీ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బాచుపల్లి మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్, సురేందర్ రెడ్డి, ఈనాడు శ్రీనివాస్, సోమీ రెడ్డి

,భాస్కర్ గౌడ్, మహమ్మద్ కాజా పాల్గొన్నారు.

రోడ్డు భద్రతకు రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం

- తెలంగాణలో 'TG-TMARS' ఏర్పాటు!

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

రాష్ట్రంలో నిత్యం వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ నిర్వహణ అంటే, కేవలం చలానాలు వసూలు చేయడమే కాకుండా, శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడం, అత్యవసర వైద్య సాయం అందించడమే లక్ష్యంగా 'తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో' (TG-TMARS)ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం అందుకు సంబంధించిన జీవో 135 విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నడిచే 'రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి' పరిధిలోనే ఈ కొత్త వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రత్యేక విభాగం అదనపు డీజీపీ (ADGP) లేదా ఐజీపీ (IGP) స్థాయి అధికారి నేతృత్వంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుంది. రాష్ట్రంలోని 32 వేల కిలోమీటర్ల కంటే ఎక్కువ ఉన్న రహదారులు, 1.8 కోట్లకు పైగా ఉన్న వాహనాల రాకపోకలను ఈ బ్యూరో పర్యవేక్షిస్తుంది. రోడ్డు రవాణాతో పాటు మెట్రో, రైల్వే భద్రతను కూడా ఈ విభాగానికే అప్పగించారు.

బాధితుల ప్రాణాలు కాపాడేందుకు పోలీసులు పని చేయాలి

బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతీ పోలీస్ స్టేషన్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఒక 'రోడ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ ఆఫీసర్'ను నియమిస్తారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను 'గోల్డెన్ అవర్'లో ఆసుపత్రికి తరలించడం వీరు బాధ్యత. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు (ORR), 50 కిలోమీటర్ల కంటే ఎక్కువ ఉన్న హైవేలపై స్పీడ్ డెటెక్టర్లు, అత్యాధునిక కెమెరాలతో కూడిన 'హైవే పెట్రోలింగ్ యూనిట్లు' నిరంతరం పహారా ఇస్తారు. ఈ వ్యవస్థ నిర్వహణ కోసం ప్రత్యేకంగా 'ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఫండ్'ను ఏర్పాటు చేశారు. పోలీసులకు వచ్చే ట్రాఫిక్ జరిమానాల మొత్తంలో 40 % శాతాన్ని నేరుగా ఈ నిధికే మళ్లిస్తారు. ఈ నిధులను సిబ్బంది శిక్షణ, అధునాతన సాంకేతికత, పెట్రోలింగ్ వాహనాలు , అత్యవసర రోడ్డు మరమ్మతుల కోసమే ఉపయోగిస్తారు. రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో ప్రయాణాలు మరింత సురక్షితంగా మారనున్నాయి.

వినాయక నిమజ్జన

కార్యక్రమంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి సెప్టెంబర్ 24:

బాచుపల్లి ఇందిరానగర్‌లో శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక మహోత్సవ నిమజ్జనం కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వినాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్ర నాయక్, డాక్టర్ ఎస్.పీ. నాయక్, హర్యా నాయక్, ఎం. రాజు నాయక్, ఎం. పరమేష్ నాయక్, లోకేష్ నాయక్, వినాయక కమిటీ నిర్వాహకులు సయ్యద్ సలీమ్, సయ్యద్ షకీల్, దోసకంటి వెంకటేష్, శ్రీను, సురేష్ తదితర కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు ఖైరతాబాద్ గణేశుని నిమజ్జనం..ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

రేపు ఖైరతాబాద్ గణేశుని నిమజ్జన నేపథ్యంలో హైదరాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు కానున్నాయి. ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమలవుతాయి. ఖైరతాబాద్ ఫ్లైఓవర్, ఎన్టీఆర్ మార్గ్, పీవీఎన్ఆర్ మార్గ్/నెక్లెస్ రోడ్, ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నాయి. అయితే.. విగ్రహాలను తరలించే వాహనాలకు మాత్రమే ప్రధాన ఊరేగింపు మార్గంలో అనుమతి ఉంటుందని.. మిగతా వాహనదారులంతా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. కాగా.. నారాయణగూడ, ఆర్టీసీ ఎక్స్ రోడ్, ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో వాహనదారులు

పోలీసులకు సహకరించాలని వారు కోరారు. రేపు ఉదయం పూజ అనంతరం ఖైరతాబాద్ గణేశుని శోభాయాత్ర మొదలవుతుంది. ఉదయం 6 గంటలకు గణేశ్ మండపం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుంది. సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా.. లుంబినీ పార్క్ పక్కన ఉన్న ఎన్టీఆర్ మార్గ్ మీదుగా గణేశ్ విగ్రహాన్ని తరలిస్తారు. అనంతరం హుస్సేన్‌సాగర్‌లో స్వామివారి విగ్రహాన్ని నిమ జ్జనం చేయనున్నారు.ప్రపంచ పటాలు పరిశీలించండి.

బ్రిడ్జి తొలగింపునకు మోక్షం లభించినట్లేనా..!?

- త్వరలో బ్రిడ్జి తొలగింపు పనులు ?
- పట్టణంలో ప్రధాన రహదారికి పూర్వ వైభవానికి చర్యలు !?
- గత కొంతకాలంగా సంబంధిత శాఖ అధికారుల సర్వే
- అధికారులతో కలిసి బ్రిడ్జిని పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ కౌన్సిలర్లు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 24 (వెలుతురు):

ఆ బ్రిడ్జి ....యాదగిరిగుట్ట పట్టణాన్ని రెండు ముక్కలుగా విడగొట్టింది. పట్టణ వాసులకు తీవ్రమైన అసంతృప్తిని, కలిగించింది. ఒకింత మనశ్శాంతి లేకుండా చేసింది.. తీరని నష్టాన్ని చేకూర్చింది. వైకుంఠ ద్వారం నుండి తెలంగాణ చౌరస్తా వరకు పట్టణ ప్రధాన రహదారిని ఈ బ్రిడ్జి రెండు ముక్కలుగా విడగొట్టడంతో రోడ్డుకు ఇరువైపు లా ఉన్న చిరు వ్యాపారులు స్థానికులు తీవ్రంగా నష్టపోవడంతో పాటు ప్రతినిత్యం తీవ్రమైన అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక అటు గాంధీనగర్ నల్లపోచమ్మ వాడ యాద గిరి పల్లి కొత్త బస్టాండ్ కు దారితీస్తూ వేసిన బ్రిడ్జి గాంధీ నగర్ నల్ల పోచమ్మ వాడలకు గోశాలకు ఉన్న అను బం ధాన్ని ఎడబాపింది . యాదగిరి పల్లి జంగాల కాలనీ మీదుగా వెళ్లిన బ్రిడ్జి యాదగిరిపల్లి గ్రామా న్ని కిందికి నెట్టేసింది. ఈ బ్రిడ్జి ఒక విధంగా స్థానికులకు తీవ్రమైన నష్టాన్ని, ఇబ్బందులను కలిగించింది అని చెప్పవచ్చు.

బ్రిడ్జి నిర్మాణం నుండి స్థానికుల అసంతృప్తి :

ఈ బ్రిడ్జి నిర్మాణం అవుతున్నప్పటి నుంచి స్థానికులు తీవ్రమైన అసంతృప్తిని వ్యతిరేకతను వ్యక్తం చేశారు. గాంధీ నగర్ నల్ల పోచమ్మ వాడ నుండి గోశాల ప్రాంతానికి ఈ బ్రిడ్జి అడ్డుగా మారి ఈ ప్రాంతవాసుల ఉపాధిని దెబ్బతీసింది . స్వామివారిని దర్శించుకున్న భక్తులు యాత్రికులు గోశాలకు ప్రతినిత్యం వచ్చి సేద తీరేవారు. ఇక్కడ గాంధీనగర్ నుండి యాదగిరి పల్లి వరకు ఉన్న చిరు వ్యాపారులకు యాత్రికులతో వ్యాపారాలు జరిగేవి . వారికి ఉపాధి దొరికేది. బ్రిడ్జి నిర్మాణంతో వారి వ్యాపా రాలు దెబ్బతిని ఉపాధి కోల్పోయి అనేకమంది తీవ్రంగా నష్టపోయారు . యాదగిరి పల్లి వరకు ఉన్న బ్రిడ్జి యాదగిరి పల్లి గ్రామాన్ని దాదాపుగా అభివృద్ధిలో వెనక్కి తోసేసింది అని చెప్పవచ్చు.

కళావిహీనంగా ప్రధాన రహదారి :

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుండి యాదగిరిగుట్ట చేరుకునే భక్తులకు ప్రధాన రహదారిగా ఉన్న మెయిన్ రోడ్డు ప్రాంతం బ్రిడ్జి నిర్మాణంతో ఒకింత కళావిహీనంగా తయారయింది అని చెప్పవచ్చు . శ్రీరాంనగర్ , గుండ్లపల్లి బస్టాండ్, తెలంగాణ చౌరస్తా, సింహద్వారం వరకు రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు తోపుడుబండ్లపై ఉండే చిరు వ్యాపారులు ఇక్కడికి వచ్చే భక్తులు యాత్రికులతో ప్రతినిత్యం ఉపాధి పొందేవారు . బ్రిడ్జి నిర్మాణంతో వైకుంఠ ద్వారం నుండి తెలంగాణ చౌరస్తా వరకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు, మడిగెల యజమానులు, చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు . అంత ఎత్తున నిర్మాణమైన బ్రిడ్జితో ఇరువైపులా దుకాణాలు కనిపించక , బ్రిడ్జి పక్కనుండి దుకాణాల వైపు యాత్రికులు రాకపోవడంతో అనేకమందికి తీవ్రమైన నష్టం వాటిని ఎంతోమంది ఉపాధి కోల్పోయారు. హైదరాబాదు నుండి వచ్చే యాత్రికులు భక్తులు తెలంగాణ చౌరస్తా వద్ద నేరుగా బ్రిడ్జిని ఎక్కి బ్రిడ్జి మీదుగా కొండపైకి చేరుకుంటున్నారు . దైవదర్శనం తర్వాత కొండపై నుండి బ్రిడ్జి మీదుగా తిరిగి నేరుగా బస్టాండ్ వద్దకు చేరుకొని భువనగిరి మీదుగా తిరుగు ప్రయాణం అవుతున్నారు . స్వామివారి దర్శనం తర్వాత ఈ యాత్రికులు భక్తులు పట్టణంలో తిరిగే అవకా శాన్ని ఈ బ్రిడ్జి పోగొట్టింది అనే చెప్పవచ్చు. స్వామివారి దర్శనం తర్వాత భక్తులు యాత్రికుల్లో అత్యధిక మంది కొండపై నుండి నేరుగా బ్రిడ్జి మీదుగా తిరిగి తమ తమ గమ్యస్థానాలకు వెళ్లిపోతున్నారు. దీంతో స్థానిక వ్యాపారు లకు వ్యాపారం జరగక ఉపాధి కూలిపోయి స్థానిక చిరు వ్యాపారాల ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందే వందలాది కుటుంబాలు దిక్కుతోచని పరిస్థితుల్లో బిక్కు బిక్కుమంటూ దీనావస్థలో గడుపుతున్నారు.

బ్రిడ్జి లేనప్పుడు యాత్రికులతో కిటకిటలాడిన ప్రధాన రహదారి:

గతంలో బ్రిడ్జి నిర్మాణం జరగని సమయంలో కొండపైకి వెళ్లిన భక్తులు యాత్రికులు కొండకిందికి వచ్చి అటు చెక్ పోస్ట్ ప్రాంతం , తులసి కాటేజీ నుండి కొండపైకి వెళ్లే రహ దారి వరకు ఇటువైకుంఠ ద్వారం నుండి బస్టాండ్ వరకు అటు గోశాల యాదగిరి పల్లి వరకు యాత్రికులు భక్తులు తిరుగుతూ సందడి చేసేవారు. దుకాణాలలో వస్తువులు, నిత్యవసర సరుకులు కొనుగోలు చేసేవారు. కిరాణం సరు కులు కొనుగోలు చేసి స్థానికంగా ఉంటూ వంటలు చేసు కుని రెండు మూడు రోజులు ఇక్కడే గడిపేవారు. దీంతో స్థానికులకు చిరు వ్యాపారులకు , అన్ని రకాల దుకాణా లకు మంచి వ్యాపారం జరిగేది. అనేక మంది ఉపాధి పొందేవారు . యాదగిరిగుట్ట కూడా నిత్యం భక్తులు యాత్రి కులతో కళకళ లాడుతూ నిత్య కళ్యాణం పచ్చతో రణం అన్నట్లుగా పట్టణంలో పండుగ వాతావరణం కనిపించేది. ప్రస్తుతం పట్టణంలో ఆ పరిస్థితి మచ్చుకైన కనిపించడం లేదని స్థానికులు తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణాన్ని రెండు ముక్కలు చేసిన బ్రిడ్జి, ఉపాధికి గండి :

ఇటు వైకుంఠ ద్వారం నుండి తెలంగాణ చౌరస్తా వరకు ఉన్న బ్రిడ్జి ఇరువైపులా రోడ్డుపై ఉన్న వ్యాపారుల ఉపాధిని తీవ్రంగానే దెబ్బకొట్టింది అని స్థానికులు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులకు అసౌకర్యంగా తీవ్ర ఇబ్బందికరంగా మారిన ఈ బ్రిడ్జిని తొలగిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా బ్రిడ్జిని తొలగించకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు తరచుగా అధికార పార్టీపై విమర్శలు గుప్పిస్తూ వచ్చాయి. అధికార పార్టీ నాయకు లకు బ్రిడ్జిని కూలగొట్టేందుకు గడ్డపార , పనిముట్లు దొరకడం లేదా ? అంటూ ప్రతిపక్ష పార్టీలు వ్యంగ్యా స్త్రాలు సంధించాయి. ప్రస్తుతం సంబంధిత శాఖ అధికా రులు గత కొన్ని రోజులుగా ఈ బ్రిడ్జి తొలగింపు పై సర్వే లు నిర్వహించారు. ఎట్టకేలకు ఈ బ్రిడ్జిని తొలగించేందు కు మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది. బ్రిడ్జిని తొల గించి యాదగిరిగుట్ట పట్టణవాసుల ఇబ్బందులు తీర్చేం దుకు రంగం సిద్ధమైందని తెలుస్తోంది. త్వరలో ఈ బ్రిడ్జి తొలగింపుకు పనులు ప్రారంభం కానున్నట్లు సమాచారం.

బ్రిడ్జిని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ అధికారులు :

వైకుంఠ ద్వారం నుండి తెలంగాణ చౌరస్తా వరకు అటు గాంధీనగర్ నల్లపోచమ్మ వాడ యాదగిరి పల్లి జంగాల కాలనీ వరకు ఉన్న బ్రిడ్జి ప్రాంతాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ స్థానిక కౌన్సిలర్లు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు . బ్రిడ్జిని ఎక్కడినుండి ఎక్కడి వరకు తొలగించాలి ? ఏ మేరకు తొలగించాలి ? అనే అంశాలను పరిశీలించారు. తిరిగి రోడ్డును పట్టణం లోని ప్రధాన రహదారిలా పూర్వ వైభవం ఏలా తె ప్పించా లి ? రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాలకు అనుకూలంగా రోడ్డును ఎలా వేయాలి ? అనే అంశాలను పరిశీలించారు. బ్రిడ్జి తొలగించిన తర్వాత వైకుంఠ ద్వారం, అటు కొండపైకి వెళ్లే రెండు రహదారులను కలుపుతూ రోడ్డు నిర్మాణం ఎంత ఎత్తులో ఏ వి ధంగా నిర్మాణం చేయాలి ? అనే అంశంపై అధికారులతో మాట్లాడారు. ఈ పరిశీలనలో వైస్ చైర్మన్ బరిగే రమ్య రామచందర్, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్ యాదవ్, బూడి ద మధు, పేరబోయిన సత్యనారాయణ యాదవ్ , సీనియ ర్ కాంగ్రెస్ నేత బంధారపు బిక్షపతి తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి నుండి పట్టణ ప్రజలకు మోక్షం : మున్సిపల్ చైర్మన్

పట్టణాన్ని , యాదగిరిపల్లి గ్రామాన్ని రెండు గా విడగొడుతూ నిర్మాణమైన బ్రిడ్జి నుండి ప్రజలకు మోక్షం లభించనుందని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ తెలిపారు. బ్రిడ్జి తొలగించేందుకు సంబంధిత శాఖ అధికారులతో కలిసి పరిశీలన చేశామని చెప్పారు . త్వరలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బ్రిడ్జి తొలగింపు పనులను ప్రారంభించనున్నారని అన్నారు. ఈ బ్రిడ్జి తొలగింపుతో ఎంతో కాలంగా ఇబ్బందుల పాలవుతున్న పట్టణ ప్రజలకు ఊరట కలగనుందని అన్నారు. ఉపాధి కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన స్థానికులకు బ్రిడ్జి సమస్య తొలగిపో యి తిరిగి వారికి మేలు చేకూరుతుందని చెప్పారు. ఎట్టకేలకు త్వరలో బ్రిడ్జి తొలగింపు పనులు ప్రారంభం అవుతాయని తిరిగి పట్టణంలోని రెండు భాగాలను కలుపుతూ యధావిధిగా రోడ్డు నిర్మాణం జరుగుతుందని మున్సిపల్ చైర్పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ స్పష్టం చేశారు.

పుట్ట హనుమంత్ , (సీనియర్ జర్నలిస్టు)

ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలి

- జీవో 25ను సవరించి.. ప్రతి తరగతికి ఒక టీచర్‌ను నియమించాలి

గుండాల, సెప్టెంబర్ 24 (వెలుతురు):

ఉపాధ్యాయులపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించాలని, జీవో నంబర్ 25ను సవరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌జీటీయూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గుండాల మండలంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో చేపట్టిన కార్యక్రమాల్లో ఎస్‌జీటీయూ నాయకులు పాల్గొన్నారు.ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని, ఎఫ్ఎల్ఎన్ పాఠశాలల్లో ప్రతి సబ్జెక్టుకు ఒక టీచర్‌ను నియమించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించి ఉపాధ్యాయులపై భారం తగ్గించాలని కోరారు. బోధనేతర పనులను తగ్గించి, ఉపాధ్యాయులకు బోధనపై దృష్టి సారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీటీయూ నాయకులు జంపాల రాజు, వై.శ్రీధర్, ఈ.సుధాకర్, మంజుల, వేణు, కృష్ణ, శ్రీనాథ్, సుధాకర్, తిరుపతి, ప్రియాంక, నవ్య, లక్ష్మీపతి, జబీన్ బేగం తదితరులు పాల్గొన్నారు

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్

మునుగోడు,సెప్టెంబర్ 24 (వెలుతురు):

మండల పరిధిలోని కచలాపురం గ్రామ అంగన్ వాడీ కేంద్రాన్ని గురువారం గ్రామ సర్పంచ్ ఏర్పుల మోహన్‌బాబు సందర్శించారు.ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలను పరిశీలిం చారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్యా బోధన,ఇతర సౌకర్యాలపై అంగన్‌వాడీ సిబ్బం దిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని రికార్డులను పరి శీలించి,పిల్లల హాజరు,కి అందుతున్న సేవల వివ రాల ను తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, చిన్నారులకు నాణ్య మైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.గ్రామంలో అంగన్ వాడీ కేంద్రానికి అవసరమైన సౌకర్యాల కల్పన కు వంతు సహకారం అందిస్తానని సర్పంచ్ పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల కోలాహలం.. గణనాథుడి శోభాయాత్ర

మునుగోడు,సెప్టెంబర్ 24 (వెలుతురు):

మండలంలోని ఎలగలగూడెం గ్రామంలో శ్రీ హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడి శోభాయాత్ర గురువారం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన గణనాథుడి విగ్రహాన్ని శోభాయాత్రగా గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి నామస్మరణలు, భక్తిగీతాలతో సందడి చేశారు.గ్రామ వీధులు గణనాథుడి నామస్మరణతో మార్మోగాయి. బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ మేకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శోభాయాత్రను ప్రారంభించారు. యువత ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వార్డు సభ్యుడు దాం రామకృష్ణ, కమిటీ సభ్యులు డొంకల శేఖర్,డొంకల లింగస్వామి,తీర్పారి శ్రీశైలం,దాం నాగరాజు, తీర్పారి నాగరాజు, కొమ్ము లింగస్వామి, దాం పురుషోత్తం, డొంకల పరమేష్, దాం రమేష్,డొంకల గణేష్, డొంకల నరసింహ,దాం స్వామి,తీర్పారి శివరాం,డొంకల రుషి పాల్గొన్నారు.



వర్మీ కంపోస్టుతో సేంద్రియ సాగుకు ప్రోత్సాహం

- **27 గ్రామాల నుంచి 54 మంది రైతులకు శిక్షణ...**
- **వర్మీ కంపోస్టు బెడ్స్ పంపిణీ...**

జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:
యు.ఎన్.డి.పి.–బయోఫిన్ సంస్థల సహకారంతో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని డి.డి.ఎస్.–కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వర్మీ కంపోస్టు తయారీ, ఉపయోగాలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 27 గ్రామాల నుంచి 54 మంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.డి.ఎస్.–కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డా. సి. వర ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ జీవ వైవిధ్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతి వ్యవసాయం, అంతర పంటల సాగు, పంట అవశేషాల సమర్థవంతమైన నిర్వహణకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ వ్యర్థాలు, పంట అవశేషాలను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన సేంద్రియ ఎరువును తయారు చేసుకోవడానికి వర్మీ కంపోస్టు ఎంతో ఉపయోగకరమైన విధానమని వివరించారు. శిక్షణలో భాగంగా వర్మీ కంపోస్టు బెడ్ తయారీ విధానం, ఉపయోగించాల్సిన ముడి పదార్థాలు, అనువైన వానపాముల రకాలు, తేమ నిర్వహణ, బెడ్ సంరక్షణ, తయారైన వర్మీ కంపోస్టును పంటలకు వినియోగించే విధానంపై రైతులకు ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. అలాగే రైతులు తమ పంటల్లో ఎదుర్కొంటున్న పురుగు–తెగుళ్లు, పోషక లోపాలు, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర వ్యవసాయ సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలకు అనుగుణంగా నివారణ, యాజమాన్య చర్యలపై శాస్త్రవేత్తలు సాంకేతిక సూచనలు అందించారు. కార్యక్రమంలో

భాగంగా 27 గ్రామాల నుంచి వచ్చిన 54 మంది రైతులకు వర్మీ కంపోస్టు బెడ్స్‌ను పంపిణీ చేశారు. రైతులు తమ గ్రామాల్లో వర్మీ కంపోస్టు యూనిట్లను ఏర్పాటు చేసుకొని సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని, పంట అవశేషాలను పునర్వినియోగం చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో డి.డి.ఎస్.–కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వి. రమేష్, హేమలత, భూసార పరీక్ష నిపుణులు స్వామి, ఇతర సిబ్బంది, డి.డి.ఎస్. సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చిగురుమామిడి ఆదర్శ పాఠశాల , కళాశాలలో 'నషా ముక్త భారత్ అభియాన్' అవగాహన ప్రోగ్రాం....

కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 24:
మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిగురుమామిడి ఆదర్శ పాఠశాల మరియు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు 'నషా ముక్త భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అర్జిత్ కౌర్ అధ్యక్షతన.ఈ కార్యక్రమంలో , మిషన్ వాత్సల్య అధికారి సాదినేని రమేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ సుందరగిరి సాయికిరణ్ గౌడ్ పోషణ్ అభియాన్ సిబ్బంది రోమిలా, ప్రణీత , మహిళా సాధికారత కేంద్రం నుండి జెండర్ స్పెషలిస్ట్ కవిత పాల్గొని విద్యార్థులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.డ్రగ్స్ , మత్తు పదార్థాల వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబంపై, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాల గురించి వివరంగా వివరించారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా పూర్తిగా దూరంగాఉండాలని సూచించారు.సోల్ మీడియాను అత్యంత జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని, అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోకూడదని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు, ఫోటోలు లేదా ఇతర సమాచా రాన్ని ఎవరికీ ఇవ్వకూడదని తెలిపారు.సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానాస్పద సందేశాలు, లింకులు మరియు వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులను సులభంగా నమ్మవద్దని, ఏదైనా అనుమానాస్పద పరిస్థి తి ఎదురైతే వెంటనే తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల కు సమాచారం అందించాలని కోరా రు.మొత్తంగా, విద్యార్థులు డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, పూర్తి ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గ్రామీణ SERP ఆధ్వర్యంలో 17వ వార్షిక సర్వసభ్య సమావేశం

- **ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్**

కొడిపల్లి వెలుతురు సెప్టెంబర్ 24:
కొడిపల్లి మండల కేంద్రంలోని వెలుగు భవనంలో 17వ వార్షిక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని VO ల నుండి అధ్యక్షులు, కోశాధికారి, కార్యదర్శి హాజరయ్యారు.గత వార్షిక సంవత్సరం 2025–26 మార్చ్ 31 వరకు మహిళా సంఘాలకు ఉపాధి కొరకుఎన్ని రుణాలు ఇచ్చారు ఎన్ని రికవరీ చేశారు అని ఈ వార్షిక సంవత్సరం 30 కోట్ల వరకు రుణాలు ఇచ్చేందుకు టార్గెట్ పెట్టారు. ఈ సందర్భంగా జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు , కొడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం మహిళల పట్ల ఎంతో సానుకూలంగా ఉందని వారికి కావలసిన ఉపాధిని అందించడానికి ఎంత రుణమైన ఇస్తుందని వీటిని అన్ని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని , మహిళలను గౌరవించడం మా ప్రభుత్వం యొక్క ప్రథమ కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్ వెలుగు అధ్యక్షురాలు పున్నమ్మ, రాధిక, లత, ఏపీఎం సంగీత, వార్డు మెంబర్ దేవేందర్ ,సీసీలు ఉమాశంకర్, రమేష్, రజిత, వివో ఏలు లాల్య, సుధాకర్, సామెల్, సాయి, ఏసు తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్

గడువు ముగిసిన స్వీట్లు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు.. తనిఖీలు

- **బిగ్ మిశ్రా దూద్‌పేడా స్వీట్‌హౌస్, క్లాసిక్ రెస్టారెంట్‌లో అధికారుల పరిశీలన..**

జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బిగ్ మిశ్రా దూద్‌పేడా స్వీట్ హౌస్, క్లాసిక్ రెస్టారెంట్‌లో మున్సిపల్ కమిషనర్ జి ప్రభాకర్ సంగారెడ్డి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాల అమలును పరిశీలించారు. బిగ్ మిశ్రా దూద్‌పేడా స్వీట్‌హౌస్‌లో గడువు ముగిసిన మోతీచూర్ లడ్డూలను నిల్వ చేసి విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు అందడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ ఆహార పదార్థాలను పరిశీలించడంతో పాటు వాటి గడువు తేదీలు, నిల్వ చేసే విధానం, పరిసరాల పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. అనంతరం క్లాసిక్ రెస్టారెంట్‌లోనూ అధికారులు పరిశీలన చేపట్టి వంటగది, ఆహార పదార్థాల నిల్వ విధానం, పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు సంస్థల నిర్వాహకులకు

అధికారులు పలు సూచనలు చేశారు. ఆహార భద్రత, పరిశుభ్రత, పారిశుధ్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, గడువు ముగిసిన లేదా ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఆహార పదార్థాలను నిల్వ చేయడం, విక్రయించడం చేయకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించేలా నిరంతరం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బాల గణేశ్‌కు ఘనంగా వీడ్కోలు

- **శ్రీరామ్ వీధిలో భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకలు....**

జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని శ్రీరామ్ వీధిలో బాల గణేశ్ నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గత 14 ఏళ్లుగా వీధిలోని చిన్నారులు, మహిళల సహకారంతో గణేశ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేపట్టారు. మహిళలు, చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. గణపతి నామస్మరణలు, భక్తిగీతాలతో శ్రీరామ్ వీధి పరిసరాలు మార్మోగాయి. అనంతరం గణేశ్ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వీధివాసులు, మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

- **ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అస్లాం ఫారోఖి పిలుపు..**

జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:
విద్యార్థులు విద్యార్జనతో పాటు సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అస్లాం ఫారోఖి పిలుపునిచ్చారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవలో విద్యార్థులు భాగస్వాములు కావడం ద్వారా వారి సమగ్ర వికాసం సాధ్యమవుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లచ్చయ్య మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా స్ఫూర్తి పొంది విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. డాక్టర్ నరహరిమూర్తి "మానవ సేవయే మాధవ సేవ" అనే భావనను విద్యార్థులు ఆచరించాలని

అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎస్. రాములు, డి. ప్రీతి, ఎం.డి. ముజఫర్ అలీ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ అద్భుతమైన సేవా కార్యక్రమమని, విద్యార్థులంతా ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కరీంనగర్ టవర్ సర్కిల్‌లో వైభవంగా వినాయక నిమజ్జన వేడుకలు..

- **వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం..**

కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 24:
కరీంనగర్ పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిమజ్జన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. విశ్వహిందూ పరిషత్, హిందూ ఉత్సవ సమితి, కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ నగరంలోని ప్రసిద్ధ టవర్ సర్కిల్ వద్ద నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకలు కార్యక్రమం ఘనంగా జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కొలువైన గణనాథుల ప్రతిమలు భారీ శోభాయాత్రల మధ్య టవర్ సర్కిల్ వద్ద ఆయా వినాయకులు పూజలు అందుకుని నిమజ్జనానికి తరలి వెళ్లే వేడుకల్లో సాయిని మల్లేశం పాల్గొని మాట్లాడారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు సమాజంలో కుల, మతాలకు అతీతంగా ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చి, హిందూ ఐక్యతను చాటుతాయన్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడిని కడసారి దర్శించుకోవడం, మన సనాతన సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనమని తెలిపారు.భక్తులు యువజన సంఘాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు కరీంనగర్ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు,

హిందూ ఉత్సవ సమితి సభ్యులు, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్థానిక భక్తులు పాల్గొన్నారు. టవర్ సర్కిల్ ప్రాంతం "గణపతి బప్పా మోరియా" నినాదాలతో మార్మోగింది.

విధులకు వెళ్లి వ్యక్తి అదృశ్యం

- **53 ఏళ్ల రికార్డ్ అసిస్టెంట్ కోసం గాలింపు.. కేసు నమోదు**

జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

సంగారెడ్డి జిల్లా రంజోల్ గ్రామాని కి చెందిన పిట్టల మాణయ్య (53) అదృశ్యమైన ఘటనపై జహీరాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మాణయ్య సంగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. సెప్టెంబర్ 4న సదాశివపేట నుంచి విధులకు వెళ్లిన అనంతరం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువు లు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినప్పటికీ ఆచూకీ లభించలేదు. సెప్టెంబర్ 16న కుమార్తెకు ఫోన్ చేసి తాను దీర్ఘకాలిక సెలవుకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన ఫోన్ స్విచ్ఆఫ్‌లోకి వెళ్లింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు Cr.No.110/2026 U/h Man Missingగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వ్యక్తి వివరాలు:

పిట్టల మాణయ్య, వయస్సు 53 సంవత్సరాలు, తండ్రి పేరు రాములు. నివాసం రంజోల్ గ్రామం. ఎత్తు సుమారు 4.5 అడుగులు, ఛాయ గోధుమ వర్ణం. ఆయన ఆచూకీ తెలిసిన వారు జహీరాబాద్ రూరల్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకోవాలి

- **తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జీతంలో 15 శాతం కోత తప్పదు**
- **జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు**
- **వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్**

సూర్యాపేట, వెలుతురు సెప్టెంబర్ 24:
సమాజానికి, కుటుంబానికి మార్గదర్శకులైన వయోవృద్ధులను గౌరవించి, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీ య వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు నిర్వహించనున్న వయోవృద్ధుల వారో త్సవాల వాల్‌పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్ లోని వీసీ ఛాంబర్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ సీనియ ర్ సిటిజన్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధా ప్యం లో ఉన్న తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంప కుండా ఇంట్లోనే ఉంచుకుని ప్రేమగా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

తల్లిదండ్రుల సంరక్షణపై చట్టం

వృద్ధుల రక్షణ, ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన తెలంగాణ ఎంప్లాయీస్ అకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ చట్టం గురించి కలెక్టర్ వివరించారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోకుండా నిర్లక్ష్యం చేసే పిల్లల స్థూల వేతనం నుంచి 15 శాతం లేదా గరిష్టంగా రూ.10 వేల వరకు కోత విధించి, ఆ మొత్తాన్ని తల్లిదండ్రుల ఖాతాలో జమ చేసేలా నిబంధనలు ఉన్నాయని తెలిపారు. వృద్ధుల హక్కులు, వారికి అందుబాటులో ఉన్న చట్టాలు, ప్రభుత్వ సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వృద్ధుల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, చట్టప్రకారం న్యాయం చేస్తున్నామని తెలిపారు. సీనియర్ సిటిజన్లకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం కేటాయించిన ఉచిత టోల్‌ఫ్రీ నంబర్ 14567కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ సూచించారు.

వారం రోజుల పాటు కార్యక్రమాలు

- **సెప్టెంబర్ 24: వృద్ధుల శ్రేయస్సు, సాధికారత వారోత్సవాల ప్రారంభం, పోస్టర్ల ఆవిష్కరణ.**
- **సెప్టెంబర్ 25: వృద్ధుల ఆరోగ్య, సంరక్షణ దినోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమాల్లో వినోద కార్యక్రమాలు, ఇండోర్ ఆటలు.**
- **సెప్టెంబర్ 26: వృద్ధాశ్రమాల సామర్థ్య పెంపుపై సిబ్బందికి కనీస ప్రమాణాలు, సంరక్షణపై శిక్షణ, తనిఖీలు.**
- **సెప్టెంబర్ 28: సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన. వృద్ధులపై జరిగే వేధింపులు, మోసాలు, దోపిడీల నివారణపై కార్యక్రమాలు.**
- **సెప్టెంబర్ 29: తరాల మధ్య అనుబంధం పెంపొందించేలా పాఠశాలల్లో విద్యార్థులు, వారి తాతా-బామ్మలతో ఆత్మీయ కలయికలు.**
- **సెప్టెంబర్ 30: యాక్టివ్ ఏజింగ్, వెల్‌నెస్, ఇంటర్-జనరేషనల్ వాకథాన్ నిర్వహణ.**
- **అక్టోబర్ 1: జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ముగింపు వేడుకలు.**

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యులు సీతారామయ్య, జి. విద్యాసాగర్, ఎస్‌డీ హమీద్ ఖాన్, ఇరిగే కోటేశ్వరి, గజ్జల కృష్ణారెడ్డి, వినోద్ కుమార్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గణేష్ నిమజ్జన ప్రధాన ప్రాంతమైన ట్యాంక్ బండ్

- పీపుల్స్ ప్లాజా ,నెక్లెస్ రోడ్ ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను తనిఖీ చేసిన డా.పుట్ల శ్రీనివాస్, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి హైదరాబాద్ హైదరాబాద్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ ఈ రోజు ట్యాంకుబండ్, నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా DMHO గారు వైద్య శిబిరాల్లో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు నిరంతరాయంగా అందుతున్నాయా, అవసరమైన మందులు, ఔషధాలు మరియు వైద్య

సామగ్రి తగినంతగా అందుబాటులో ఉన్నాయా అనే అంశాలను పరిశీలించారు.ప్రజలకు అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందేలా వైద్య శిబిరాల్లో అత్యవసర మందులు మరియు అవసరమైన వైద్య సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచాలని సంబంధిత సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లను, వైద్యాధికారులను,సిబ్బందిని ఆదేశించారు.అలాగే, ఉచిత వైద్య శిబిరాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, శిబిరాల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యాధికారులు , సిబ్బందికి సూచించారు.ట్యాంకుబండ్ , నెక్లెస్ రోడ్ లోని పీపుల్స్ ప్లాజా ప్రాంతాలలో 6 ఉచిత వైద్య శిబిరాలను (24/7)3 షిఫ్టులలో వైద్యాధికారులు, సిబ్బంది, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.ఈ వైద్య శిబిరాలు 27-9-26 వరకు చివరి గణేష్ ని నిమజ్జనం వరకు కొనసాగుతాయని చెప్పారు. ముగ్గురు సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్ వైద్య శిబిరాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలియజేశారు. ఈ తనిఖీలో డా. మురళీధర్, డా. అనిత ప్రోగ్రామ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లాలో 39 గౌడ కుటుంబాలను 10 ఎస్సీ కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేసిన వారిని శిక్షించాలి

- బీసీ కమిషన్ కార్యాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ జీ.ని రంజన్ గారిని కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

సభ్య సమాజం తలదించుకునేలా రాకెట్ యుగంలో కూడా ఇంకా గ్రామ అభివృద్ధి కమిటీల (వీడీసీ) పేరుతో గ్రామాలలో ఇంకా బహిష్కరణల కాలం నడుస్తుందని బిసి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామానికి చెందిన 39 గౌడ , 10 ఎస్సి

కుటుంబాలను గ్రామ బహి ష్కరణ చేసినని కఠినంగా శిక్షిం చాలని కోరుతూ ఈరోజు బీసీ కమి షన్ కార్యా లయంలో కమిషన్ చైర్మ న్ జి. నిరంజన్ గారిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు లింగం గౌడ్ తెలిపా రు. గతంలో కూడా సాక్షాత్తు జిల్లా జడ్జి పోలీస్ కమిషనర్ వచ్చి చెప్పిన ఆ గ్రామంలో ఉన్న వారు మారకపోవడం దుర్మార్గమని అన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ పార్క్‌లో వైభవంగా గణనాథుడి లడ్డూ వేలం పాట, లక్కీ డ్రా

- రూ.1,21,000 పలికిన గణనాధుని లడ్డూ

ఉప్పల్, సెప్టెంబర్ 23(వెలుతురు):

కాప్రా సర్కిల్ పరిధిలోని శ్రీ భావనా ఋషి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ పార్క్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రసాదాల వేలం పాట, లక్కీ డ్రా కార్యక్రమాలను నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక కాలనీ వాసుల భాగస్వామ్యంతో జరిగిన ఈ వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని ప్రసాదాలను దక్కించుకున్నారు. వేలం పాటలో గణనాథుడి తొలి పవిత్ర లడ్డూను సి.హెచ్. వెంకటేశ్వర్లు రూ.1,21,000లకు, రెండవ లడ్డూను సంతోష్ గౌడ్ తన కుమారుడు హృదీయాన్ష్ పేరుమీద రూ.80,000లకు పాడి సొంతం చేసుకున్నారు. అలాగే పూజా కలశాన్ని తన్నీర్ పరమేశ్ రూ.33,000లకు, పట్టు వస్త్రాలను (పంచా-కండువా) తోట రాములు రూ.9,000లకు దక్కించుకున్నారు. అనంతరం నిర్వహించిన లక్కీ డ్రాలో 5 కేజీల లడ్డూ బహుమతిని

శ్రీమతి దీపికా కమలాకర్ గెలుచుకోగా, 43 ఇంచుల ఎల్ఈడీ టీవీని పృథ్వీరాజ్ సాధించారు. వేలం విజేతలను, విజేతలైన భక్తులను నేతాజీ సుభాష్ చంద్రబోస్ పార్క్ కమిటీ సభ్యులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో కాలనీవాసులందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సమీక్షా సమావేశం

- సెప్టెంబర్ 30 నాటికి డిజిటల్ క్రాప్ సర్వే (DCS) మరియు రైతు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి

రంగారెడ్డి జిల్లా, వెలుతురు సెప్టెంబర్ 24:

వ్యవసాయ రంగానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానిస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే (DCS) మరియు రైతు నమోదు (Farmer Registry) ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ బి. చంద్రరెడ్డి ఆదేశించారు. అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్ , కార్యదర్శి సూచనల మేరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లైస్, మీసేవ, మరియు సబ్ సెంటర్ల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలోని ముఖ్య విషయాలు:

వరి కొనుగోలు సెంటర్లు ప్రారంభం:

అక్టోబర్ 1వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, సెప్టెంబర్ 30, 2026 నాటికి డిజిటల్ క్రాప్ సర్వే (DCS) పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రూ. 500 బోనస్ వర్తించే 7 సన్న వరి రకాలు:

ప్రభుత్వం గుర్తించిన (1) BPT-5204, (2) RNR-15048 (తెలంగాణ సోనా), (3) KNM-1638, (4) KNM-7715, (5) HMT సోనా, (6) జై శ్రీరామ్, (7) WGL-44 అనే ఏడు రకాల సన్న వరి పంటలకు మాత్రమే క్వింటాలుకు రూ. 500 బోనస్ వర్తిస్తుందని, కొనుగోలు ప్రక్రియకు క్రాప్ సర్వే డేటా ఎంతో కీలకమని తెలియజేశారు.

రైతు నమోదు (Farmer Registry) అవశ్యకత:

ప్రభుత్వ పథకాల సబ్సిడీలు పొందడానికి మరియు ఎరువుల కొనుగోలు యాప్ (FFS)లో బుకింగ్ చేసుకోవడానికి రైతు నమోదు సంఖ్య (Farmer ID) తప్పనిసరి.

ప్రత్యేక క్యాంపులు , ప్రచారం: ప్రతి గ్రామంలో మీసేవ మరియు కామన్ సర్వీస్ సెంటర్ల (CSC) భాగస్వామ్యంతో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని, అలాగే చాటింపు (Tom Tom) మరియు ఫ్లెక్సీల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి ఎం. సుజాత, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎస్. స్వర్ణ మరియు ఇతర శాఖల అధికారులు, మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్ల జిల్లా మేనేజర్లు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ప్రాంతాల్లో సైబరాబాద్ సీపీ డా. యం. రమేష్ పర్యవేక్షణ

- నిమజ్జనం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 24:

గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాట్లను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్ గురువారం స్వయంగా పరిశీలించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నార్సింగి నెక్లంపూర్ చెరువు, కోకాపేట చెరువు, అమీన్పూర్ పరిధిలోని రాయసముద్రం లేక్, సాకి చెరువు, పటాన్‌చెరు, చందానగర్‌లోని గంగారం చెరువుతో పాటు నార్సింగి, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నిమజ్జన ప్రాంతాలను సీపీ సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. పోలీసులతో పాటు విద్యుత్, రెవెన్యూ, వైద్య, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీపీ

సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. నిమజ్జనాలను ఆసరాగా చేసుకుని ఆకతాయితనానికి పాల్పడేవారు, దొంగతనాలకు పాల్పడే ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సీపీ స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను నిశితంగా గమనించి, నేరాలకు పాల్పడే వారిని గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నిమజ్జనం పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సీపీ అధికారులను ఆదేశించారు.

మాజీ సైనిక ఉద్యోగి వద్ద 14 మద్యం సీసాల స్వాధీనం

ఘట్కేసర్, సెప్టెంబర్ 24(వెలుతురు):

ఘట్కేసర్ పరిధిలోని లక్ష్మి నగర్ ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మాజీ సైనిక ఉద్యోగి బైరు వెంకటేశ్వర్లును ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. డిఫెన్స్ కోటా కింద తనకు వచ్చిన మద్యం సీసాలను ఇతరులకు విక్రయిస్తున్నాడనే నమ్మదగిన సమాచారంతో ట్రైనీ ఏఈఎస్ ముస్తఫా సిద్దిక్ నేతృత్వంలో సిబ్బంది అతడి నివాసంపై దాడి చేశారు. ఈ తనిఖీల్లో 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం సీసాలతో పాటు నిందితుడు వెంకటేశ్వర్లును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఘట్కేసర్ ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌కు అప్పగించారు.



తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రెండవసారి బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి నేరెళ్ల శారదను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ జర్నలిస్ట్, గోపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తిని వినయ్ కుమార్ గౌడ్, గౌడ యువజన నాయకుడు అంతటి వినయ్ కుమార్ గౌడ్.

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం రాజ్యాంగ విజయం

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

.బి జె ఎల్ పి చేసిన న్యాయ పోరాటం వల్లే ఈ విజయం దక్కింది. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై కోర్టుల్లో న్యాయపోరాటం క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలు కొనసాగిస్తాం ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించింది.ఎమ్మెల్యేల ఫిరాయింపుల ను ప్రోత్సహించి రాజ్యాంగ ద్రోహానికి పాల్పడిన సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడైనా బుద్ధి తెచ్చుకొని పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల తోటి రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలి.అస్తమానం రాజ్యాంగ ప్రతిని పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ ఇతర పార్టీ ఎమ్మెల్యేకు తన పార్టీ నుంచి ఎంపీ టికెట్ ఇవ్వడం ఆయన చెప్పేది ఒకటి చేసేది మరొకటి అనడానికి దర్పనం.

కరెంటు సంక్షోభానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం: కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 24:

మాజీ మంత్రి, టీజీబీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీజీబీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. విద్యుత్ కోతల ప్రభావం పరిశ్రమలు, వ్యవసాయ రంగాలపై పడుతోందన్నారు. పరిశ్రమలకు ఇప్పటికే పవర్ హాలిడే ప్రకటించారని, రానున్న యాసంగి, వేసవి పంటలకూ విద్యుత్ సరఫరాపై ఆంక్షలు విధించే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. సింగరేణి నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా కాకపోవడం వల్ల విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని ఈశ్వర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి సుమారు రూ.52 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఈ బకాయిలే ప్రస్తుత పరిస్థితికి కారణమని అన్నారు. బొగ్గు ఉత్పత్తి తగ్గడం

ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా ఉండేదని, ప్రస్తుతం ఉత్పత్తి తగ్గిపోయిందని ఈశ్వర్ పేర్కొన్నారు. గతంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం కనీసం కొన్ని గంటలపాటు కూడా విద్యుత్ అందని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. విద్యుత్ రంగంలో నెలకొన్న పరిస్థితులు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకే రాష్ట్రవ్యాప్తంగా పవర్ స్టేషన్లు, సింగరేణి కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. విద్యుత్ కోతలపై అధికారులను ప్రశ్నించి, వినతిపత్రం సమర్పించినప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేకపోయారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొడిపల్లి మండల PRTU
నూతన కార్యవర్గం ఎన్నిక

- హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్

కొడిపల్లి వెలుతురు సెప్టెంబర్ 24:

కొడిపల్లి మండల కేంద్రంలో ఈరోజు మండల PRTU టీంను జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. సామ్యా నాయక్ మాట్లాడుతూ ఎన్నుకోబడిన నాయకులు మండలంలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల అందరికి సర్వీస్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడానికి ముందుండాలి అని అన్నారు. PRTU యూనియన్ అంటేనే ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండే అతి పెద్ద ఉపాధ్యాయ యూనియన్ అని అన్నారు. మండల అధ్యక్షునిగా నరేందర్ రెడ్డి,

ప్రధాన కార్యదర్శిగా వి బాలకృష్ణ, అసోసియేట్ అధ్యక్షులుగా మహేందర్, మహిళా అసోసియేషన్ అధ్యక్షులుగా స్వాతి, ఉపాధ్యక్షులుగా నవాజుద్దీన్, మహిళా ఉపాధ్యక్షులుగా కీర్తి, కార్యదర్శులుగా యాదగిరి, పూర్ణచందర్, మహిళా కార్యదర్శులుగా అనిత, మౌనిక లు ఎన్నికయ్యారు.

ఫిరాయింపు రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ఫిరాయింపు రాజకీయాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ఆయారాం, గయారాం... ఫిర్ ఘర్ వాపస్ ఆయారాం' అన్నట్లుగా నేతల పార్టీ మార్పుల సంస్కృతిని తప్పుబట్టారు. సుప్రీంకోర్టు తీర్పుతో చెంపదెబ్బ కొట్టినా ఆ పార్టీల నాయకులకు సిగ్గు రావడం లేదని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు.

ప్రకటనలోనిముఖ్యాంశాలు:

అవకాశవాద, అధికార రాజకీయాల కోసం ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఆ పార్టీలకు చెంపపెట్టు లాంటిదని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇప్పటికీ ఎవరికి వారే తమ విజయంగా భావించడం హాస్యాస్పదమన్నారు.ఖైరతాబాద్ అనర్హత కేసుకు సంబంధించి వాస్తవాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి ఇంకో పార్టీపై పోటీ చేయడాన్ని తప్పుబడుతూ, అక్కడ ఉప ఎన్నిక అనివార్యమని పేర్కొన్నారు. అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో పోటీ చేసే నైతిక అర్హత కూడా లేదని తేల్చిచెప్పారు. సుప్రీంకోర్టు తీర్పును కొన్ని మీడియా సంస్థలు కావాలనే వక్రీకరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అనైతిక, ఫిరాయింపుల వ్యవహారాలకు పాల్పడే వారికి ఇదే గతి వర్తిస్తుందనే గట్టి సంకేతాలను పంపాలని, కాంగ్రెస్, బీఆర్ఎస్ లను

రాజకీయంగా నిమజ్జనం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "అనైతిక, ఫిరాయింపుల వ్యవహారాలకు పాల్పడే వారికి ఇదే గతి వర్తిస్తుందనే గట్టి సంకేతాలను పంపిద్దాం" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

2030 నాటికి పేదరిక నిర్మూలన..

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 24: తెలంగాణను 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా, 2033 నాటికి దేశంలోనే తొలి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యాచరణకు మరింత వేగం పెంచనుంది. రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఆర్థిక, ప్రణాళిక శాఖల కార్యదర్శులతో పాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్‌కు చెందిన GFST వైస్ చైర్మన్ ఎస్.పీ. టక్కర్‌తో పాటు GFST ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక, అమలు వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, శాఖల మధ్య సమన్వయాన్ని పెంచడం, అభివృద్ధి ఫలితాలను నిరంతరం పర్యవేక్షించేలా వ్యవస్థలను రూపొందించడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

TSDPSకు ప్రత్యేక PMU

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం (TSDPS)ను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (PMU) ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ప్రాధాన్యతా అభివృద్ధి కార్యక్రమాలకు వ్యూహాత్మక ప్రణాళిక రూపొందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, పురోగతిని వేగవంతం చేయడం వంటి బాధ్యతలను PMU నిర్వహించనుంది.

2030 నాటికి 'జీరో పావర్టీ'

2030 నాటికి తెలంగాణను 'జీరో పావర్టీ' రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక, లక్ష్యిత కార్యక్రమాలను అమలు చేయనున్నారు. పేదరికానికి గురయ్యే కుటుంబాలను గుర్తించి, వారికి అందాల్సిన వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడంతో పాటు స్థిరమైన జీవనోపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమాల ఫలితాలను కొలిచేందుకు, పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ

తెలంగాణను 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన, కేంద్రీకృత అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించనున్నారు. రాష్ట్రంలోని బలాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు, సమ్మిళిత అభివృద్ధికి కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా కార్యాచరణ రూపొందించనున్నారు.

రంగాల వారీ నిపుణుల సేవలు

రాష్ట్ర ప్రభుత్వ సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన నిపుణులు, కన్సల్టెంట్ల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక, వ్యూహాత్మక సహకారాన్ని నిపుణుల ద్వారా పొందనున్నారు.

ప్రభుత్వం–GFST భాగస్వామ్యం

వ్యూహాత్మక ప్రణాళిక, డేటా ఆధారిత నిర్ణయాలు, సాంకేతిక పరిజ్ఞానం, నాలెడ్జ్ సపోర్ట్, సామర్థ్య నిర్మాణం, పర్యవేక్షణ, కీలక అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలుకు తెలంగాణ ప్రభుత్వం–GFST మధ్య అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకునే ప్రతిపాదనను సిద్ధం చేయాలని నిర్ణయించారు.

జిల్లాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు

రాష్ట్ర స్థాయి అభివృద్ధి లక్ష్యాలను జిల్లాల స్థాయిలో కొలిచే వీలున్న ఫలితాలుగా మార్చేందుకు సమగ్ర జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఈ ప్రణాళికలకు డేటా ఆధారిత డ్యాష్‌బోర్డులు, స్పష్టమైన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (KPIs), కొలిచే వీలున్న ఫలితాలు, బడ్జెట్ అనుసంధానం ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో జిల్లాల అభివృద్ధి పురోగతిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు లోటుపాట్లను గుర్తించి, అవసరమైన చోట సకాలం లో దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్

ప్రభుత్వ శాఖలు, రంగాల నిపుణులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, అభివృద్ధి సంస్థలు, ఇతర కీలక భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ గ్రోత్ ల్యాబ్స్‌లో ప్రధానంగా పేదరిక నిర్మూలన, మౌలిక వసతులు–లాజిస్టిక్స్, ఆరోగ్యం, పర్యాటకం, పశుసంపద–ఆక్వాకల్చర్, పట్టణీకరణ, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ అంశాలపై దృష్టి సారించనున్నారు. అభివృద్ధి అవకాశాలను గుర్తించడం, అమలులో ఉన్న అవరోధాలను పరిష్కరించడం, రంగాల వారీ వ్యూహాలను రూపొందించడం, ప్రాధాన్యతలను కాలపరిమితితో కూడిన, కొలిచే వీలున్న కార్యాచరణ ప్రణాళికలుగా మార్చడం గ్రోత్ ల్యాబ్స్ ప్రధాన ఉద్దేశంగా ఉంటుంది.

ఫలితాల ఆధారంగా అభివృద్ధి

TSDPS–PMU బలోపేతం, జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్, రంగాల నిపుణుల సేవలు, ప్రభుత్వం–GFST భాగస్వామ్యం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సమగ్ర సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. డేటా ఆధారిత నిర్ణయాలు, ఫలితాలపై దృష్టి, మిషన్ మోడ్‌లో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఈ వ్యవస్థ దోహదపడనుంది. 2030 నాటికి పేదరిక నిర్మూలన, 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ లక్ష్యాలను వేగంగా సాధించేందుకు రాష్ట్ర అభివృద్ధి దార్శనికతను కార్యాచరణలోకి తీసుకురావడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని సమావేశంలో స్పష్టం చేశారు. సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉద్యమానికి ముందు బీఆర్ఎస్
నేతల ఆస్తులు ఎంత ? ఇప్పుడు ఎంత?

జైపూర్, వెలుతురు సెప్టెంబర్ 24:

తెలంగాణ ఉద్యమానికి ముందు బీఆర్ఎస్ నేతల ఆస్తులు ఎంత ఉన్నాయో.. పదేళ్ల అధికారంలో వారి ఆస్తులు ఎంత పెరిగాయో ప్రజలకు సమాధానం చెప్పాలని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. తమ ఆస్తులపై వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా జైపూర్ పవర్ ప్లాంట్ వద్ద ధర్నాలు చేయడం ఎందుకు అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద ధర్నా చేయడం ద్వారా అసలు అంశాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అన్నారు. చెన్నూరు నియోజకవర్గంలోని జైపూర్‌లో ఎస్సీ బాలుర వసతి గృహ నిర్మాణానికి మంత్రి వివేక్ వెంకటస్వామి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తెలంగాణ కోసం పోరాడుతున్న సమయంలో కొందరు రాజకీయ నాయకులు భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి 450 ఎకరాల భూమి ఎలా వచ్చిందో ప్రజలకు వివరించాలని మంత్రి అన్నారు. పదేళ్లపాటు ముఖ్యమంత్రి, మంత్రులుగా పనిచేసిన వారికి వచ్చిన జీతాలతో ఇంత పెద్ద ఎత్తున ఆస్తులు ఎలా సమకూరాయో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ సమర్థవంతంగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్లాంట్ ద్వారా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని, సీఎస్ఆర్ కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇక్కడి సీఎస్ఆర్, డీఎంఎఫ్టీ నిధులను సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ వంటి ప్రాంతాలకు తరలించి ఖర్చు చేశారని మంత్రి అన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎస్ఆర్, డీఎంఎఫ్టీ నిధులను చెన్నూరు నియోజకవర్గంలోనే ఖర్చు చేస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, ఓఆర్ఆర్‌ను ప్రైవేట్ సంస్థకు అప్పగించిన వ్యవహారాలకు సంబంధించి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీఆర్ఎస్ పార్టీ క్విడ్ ప్రోకోకు పాల్పడిందని మంత్రి అన్నారు. ఈ వ్యవహారాలపై పూర్తి స్థాయిలో విచారణ జరగాల్సిన అవసరం ఉందని, ఎలక్టోరల్ బాండ్ల అంశంపై సీబీఐ విచారణ జరపాలని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కూడా నీటి లభ్యత, సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే జూన్ వరకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కోవిడ్ సమయంలో ప్రజలు ప్రభుత్వానికి సహకరించిన విధంగానే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడంలో కూడా ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రాష్ట్రంలో ఈ నెలలో విద్యుత్ వినియోగం 19,000 మెగావాట్లకు చేరిందని మంత్రి తెలిపారు. పెరుగుతున్న విద్యుత్, నీటి అవసరాల నేపథ్యంలో ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. చెన్నూరు డిగ్రీ కాలేజీకి డీఎంఎఫ్టీ నిధుల నుంచి రూ.2 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. సోమనపల్లిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఇందులో 2,500 మంది విద్యార్థులకు హాస్టల్, క్రీడా సదుపాయాలు సహా అన్ని మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. చెన్నూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కోటపల్లిలో ఎస్సీ బాలుర వసతి గృహ నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. గతంలో రూ.25 లక్షలు మంజూరైనప్పటికీ భూమి అందుబాటులో లేక పనులు ప్రారంభం కాలేదన్నారు. ప్రస్తుతం స్థలం గుర్తించి, ఈ నెల 30న భూమిపూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. మందమర్రి ఏజెన్సీ ప్రాంతంలో పట్టా భూములు అందుబాటులో లేకపోవడంతో అక్కడి పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం సింగరేణి సంస్థ నుంచి 20 నుంచి 25 ఎకరాల భూమిని తీసుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. సింగరేణి సంస్థకు ఇప్పటికే ఈ విషయంపై ప్రతిపాదన ఇచ్చామని, కలెక్టర్ ద్వారా త్వరలో పూర్తి ప్రతిపాదనలు పంపించి అనుమతులు పొందేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెన్నూరులో 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. మందమర్రిలోని ఆర్కేపీ ప్రాంతంలో 50 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆర్కేఓసీలో కొత్త గని ఏర్పాటుకు సంబంధించిన ఫారెస్ట్ క్లియరెన్స్ ప్రక్రియ తుది దశలో ఉందని మంత్రి తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే కొత్త గని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మందమర్రిలోని సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జర్మన్ భాష నేర్చుకుంటున్న విద్యార్థులతో సమావేశమైనట్లు మంత్రి తెలిపారు. యువత జర్మన్ భాషలో మంచి ప్రావీణ్యం సాధిస్తున్నారని చెప్పారు. మరో నాలుగు నెలల్లో B2 స్థాయి పూర్తి చేసేలా శిక్షణ అందిస్తున్నామని, శిక్షణ పూర్తయిన అనంతరం జర్మనీలో రూ.25లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని చెన్నూరు నియోజకవర్గంలో సుమారు రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. మార్చి–ఏప్రిల్ నాటికి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు.

ఈ రూల్స్ బ్రేక్ చేస్తే అంతే..
తెలంగాణలో ట్రాఫిక్, రోడ్డు భద్రతకు ప్రత్యేక బ్యూరో

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 24:

రాష్ట్రంలో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రత దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నూతనంగా ట్రాఫిక్, రోడ్, రైల్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక విభాగానికి టీజీ టీఎంఏఆర్ఎస్ (TG TMARS)గా నామకరణం చేసింది. ఈ బ్యూరోకు డైరెక్టర్‌గా ఏడీజీపీ (ADGP) లేదా ఐజీ (IG) స్థాయి అధికారి వ్యవహరించనున్నట్టు పేర్కొంది.ఈ ప్రత్యేక బ్యూరో రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిర్వహణ, ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై పూర్తి పర్యవేక్షణ బాధ్యతలు చేపడుతుంది. హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పై నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తుంది. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వాటిపై శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేస్తుంది. ప్రధానంగా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలైన డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, ఓవర్ స్పీడింగ్ వంటి వాటిపై ఈ విభాగం కట్టుదిట్టమైన నిఘా ఉంచుతుంది.కొత్త బ్యూరో కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పటిష్టం చేసేందుకు ప్రతి జిల్లాలో ఒక అదనపు ఎస్పీ స్థాయి ట్రాఫిక్ పోస్టును ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఉన్న ట్రాఫిక్ విభాగంలోని 300 పోస్టులను ఈ నూతన బ్యూరోకు బదిలీ చేయనున్నారు. విధుల్లో పారదర్శకత కోసం ట్రాఫిక్ సిబ్బందికి బాడీ వోర్న్ కెమెరాలను అందజేయనున్నారు. అలాగే, సిబ్బందికి మెరుగైన శిక్షణ అందించేందుకు ప్రత్యేకంగా రాష్ట్ర ట్రాఫిక్ ట్రైనింగ్ అకాడమీని కూడా ఏర్పాటు చేయనున్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మె.. ఖాతాదారులకు
బ్యాంకులు అలర్ట్.. ముందే ఇలా ప్లాన్ చేస్కోండి..

దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి తీవ్ర అంతరాయం ఏర్పడనుంది. బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. వారానికి ఐదు రోజుల పని దినాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు సంఘాలు కొంతకాలంగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక శాఖ సూచన మేరకు డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో జరిపిన చర్చలు కూడా సఫలం కాలేదు. ఐదు రోజుల పని విధానం అంశం పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ.. స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు సమ్మె చేపట్టాలని బ్యాంక్ సంఘాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ సమ్మెకు ముందు రెండు రోజులు శని, ఆదివారాలు కావడంతో బ్యాంకులకు సాధారణ సెలవులు ఉన్నాయి. అయితే ఆదివారం బ్యాంకులు తెరిచి ఉంచాలని ఆర్థికశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆదివారం బ్యాంకులు ఓపెన్ చేసి ఉంటాయి.అయితే బ్యాంక్ సమ్మె కారణంగా 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బ్యాంకింగ్ లావాదేవీలు, నగదు ఉపసంహరణ, డిపాజిట్లు, చెక్కుల క్లియరెన్స్ వంటి సేవలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. దీంతో ఖాతాదారులు ముందుగానే తమ లావాదేవీలను ప్లాన్ చేసుకోవాలని బ్యాంకులు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందిస్తున్నాయి. అయితే ఇఈ నెల 11న కూడా బ్యాంక్ సంఘాలు సమ్మె నిర్వహించాయి. తమ డిమాండ్ నెరవేర్చకపోతే మళ్లీ ఈ నెలలో సమ్మెకు దిగుతామని ప్రకటించాయి. దీంతో ఈ నెల చివరి వారంలో మళ్లీ బ్యాంక్ ఉద్యోగ సంఘాలు సమ్మె చేపడుతున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా వినియోగదారులు తమ ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలను ముందుగానే పూర్తిచేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బ్యాంక్ సమ్మె క్రమంలో ఈ నెల 25వ తేదీనే కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు చెల్లించనుంది.అటు ఏపీలో పించన్లు ప్రతీ నెలా ఒకటో తేదీ ఉదయం అందించేవారు. బ్యాంక్ ఉద్యోగుల సమ్మె కారణంగా ఒకటో తేదీ మధ్యాహ్నం నుంచి అందించాలని నిర్ణయం తీసుకుంది. ఒకటో తేదీన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు జీతాలు జమ అవుతాయి. ఈ నెల 30వ తేదీ వరకు బ్యాంక్ ఉద్యోగులు సమ్మె కారణంగా బ్యాంక్ సేవలకు అంతరాయం కలగనుంది. దీని వల్ల ఒకటో తేదీన బ్యాంకుల్లో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముంది. దీంతో తమ జీతాలు ఒకటో తేదీన జమ అవుతాయా.. లేదా అనే టెన్షన్ ఉద్యోగులకు పట్టుకుంది.

హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీపై
మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

- **లోపాలు గుర్తించిన చోట తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టాలని ఆదేశాలు**

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:

ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలో అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన ఫైర్ సేఫ్టీ చర్యలపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని హెల్త్ ఫెసిలిటీల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాల అమలు, నిర్వహిస్తున్న ఆడిట్లు, గుర్తించిన లోపాలు, వాటిని సరిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలపై మంత్రి సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించి రెగ్యులర్‌గా ఫైర్ సేఫ్టీ ఆడిట్లు నిర్వహిస్తున్నామని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మంత్రికి వివరించారు. ఇప్పటికే నిర్వహించిన ఫైర్ సేఫ్టీ ఆడిట్లలో గుర్తించిన అంశాలు, వాటిపై తీసుకున్న చర్యల వివరాలను మంత్రికి సమర్పించారు.హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ లోపాలు గుర్తించిన చోట ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రోగులు, వారి సహాయకులు, వైద్యులు, సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిబంధనల అమలులో ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిదిద్దేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ సీఎస్ నవీన్ మిట్టల్, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫైర్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణతో పాటు హెల్త్, ఎనర్జీ, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులను కరిచిన ఎలుకలు

- **14 మందికి గాయాలు.. దవాఖానకు తరలింపు**

పాలకుర్తి, సెప్టెంబర్ 24 :

జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం రాత్రి 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిద్రిస్తున్న విద్యార్థినులను ఎలుకలు కొరుకడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. వారిని బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స వేయించారు. 14 మందికి వైద్యం చేసినట్టు ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ వనం శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయం బయటకు రాకుండా పాఠశాల సిబ్బంది, యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకున్నారు. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వక పోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఎన్నికల సంఘం ప్రజలకు పూర్తి స్పష్టత ఇవ్వాలి

- **ఓటర్ల హక్కుల విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకత అవసరం: మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై ఇటీవల వెలుగులోకి వచ్చిన అంశాలు ప్రజల్లో అనేక ప్రశ్నలను, అనుమానాలను కలిగిస్తున్నాయని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఓటర్ల జాబితా అనేది ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటం ఎన్నికల సంఘం అత్యంత కీలకమైన బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు.గత 10 నెలల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న అంశం తాజాగా వెలుగులోకి వచ్చిందని మంత్రి తెలిపారు. వారి అభ్యంతరాలు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలను కూడా స్పృశిస్తున్నాయని చెప్పారు.

ఫారం-6లో మార్పులపై స్పష్టత ఇవ్వాలి

కొత్తగా ఓటు హక్కు పొందే పౌరులు ఉపయోగించే ఫారం-6లో SIRకు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు చెబుతున్నాయని మంత్రి అన్నారు. ఫారం-6 అనేది నిబంధనల ప్రకారం నిర్దేశించిన చట్టబద్ధమైన ఫారం అయితే, అందులో మార్పులు చేయడానికి ఏ ప్రక్రియ అనుసరించారు? ఎవరి అనుమతితో మార్పులు చేశారు? ఆ మార్పులకు చట్టపరమైన ఆధారం ఏమిటి? అనే విషయాలను ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా తొలిసారి ఓటు హక్కు పొందే యువతకు ఎలాంటి అనవసర ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఫారం-6లో చేసిన మార్పులపై ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఎన్నికల సంఘం దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని కోరారు.

ECINet, ఓటర్ల డేటాపై పారదర్శకత అవసరం

ECINet వంటి కేంద్రీకృత ఐటీ వ్యవస్థ ద్వారా ఓటర్ల డేటాలో మార్పులు చేసే విధానం ఉంటే, క్షేత్రస్థాయిలో చట్టబద్ధమైన అధికారాలు కలిగిన Electoral Registration Officers (EROs) పాత్ర, వారి పర్యవేక్షణ, బాధ్యత ఏమిటో ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని మంత్రి అన్నారు. ఓటర్ల డేటా ఎవరు మార్చారు? ఎప్పుడు మార్చారు? ఏ కారణంతో మార్చారు? ఏ అధికారి అనుమతితో మార్చారు? అనే వివరాలకు ఆడిట్ ట్రయల్ ఉండాలని, అవసరమైన మేరకు ఆ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కేంద్రీకృత డిజిటల్ వ్యవస్థల విషయంలో భద్రతా ప్రమాణాలు, అధికారాల విభజన, జవాబుదారీతనం వంటి అంశాలపై స్పష్టత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై ఎన్నికల కమిషనర్లు కూడా ఆందోళనలు వ్యక్తం చేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయని తెలిపారు.

ఓటర్ల పేర్ల తొలగింపుపై పూర్తి వివరాలు వెల్లడించాలి

SIR ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడినట్లు నివేదికలు వెలువడ్డాయని మంత్రి పేర్కొన్నారు. అయితే పేర్ల తొలగింపు ఏ కారణాలపై జరిగింది? ఎంతమంది పేర్లు తొలగించారు? ఎంతమంది అభ్యంతరాలు తెలిపారు? ఎన్ని పేర్లు తిరిగి చేర్చారు? అనే పూర్తి వివరాలను రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలు నిజమా? కాదా? అనే విషయం రాజకీయ వాదోపవాదాల ద్వారా తేలకూడదని, ఓటర్ల జాబితాకు సంబంధించిన పూర్తి డేటా, తొలగింపుల వివరాలు, కొత్తగా చేర్చిన పేర్లు, అభ్యంతరాలు, అప్పీళ్ల పరిష్కారం వంటి సమాచారాన్ని ప్రజల ముందుంచడం ద్వారా వాస్తవాలు స్పష్టమవుతాయని మంత్రి అన్నారు.

ఎన్నికల సంఘం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న అనుమానాలకు తావులేకుండా వ్యవహరించాలి

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల సంఘం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తకుండా, ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అదే సమయంలో, ఎన్నికల సంఘం అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే జరిగాయని ఎన్నికల సంఘం వర్గాలు స్పష్టం చేసిన విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ, వివిధ స్థాయిల్లో నమోదైన అభ్యంతరాలపై పూర్తి వివరాలను బహిరంగపరచడం ద్వారా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.

తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడుతాం

తెలంగాణలో అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కు కాపాడబడేలా ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా పొరపాటున తొలగించకుండా చూడటం ఎంత ముఖ్యమో, అనర్హమైన పేర్ల విషయంలో చట్టం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని, అందువల్ల ఓటర్ల జాబితా తయారీ, సవరణ, పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, డేటా మార్పులు వంటి ప్రతి దశలో పారదర్శకత, చట్టబద్ధత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

జూరాల ఆయకట్టుకు వారాబందీతో సాగునీరు

- **రైతులను కాపాడుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిదే**
- **జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండనివ్వం: మంత్రి వాకిటి శ్రీహరి**

వనపర్తి వెలుతురు సెప్టెంబర్ 24:
జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు వారాబందీ విధానంలో సాగునీటిని అందిస్తామని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చూస్తామని తెలిపారు.వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు సమీక్ష సమావేశం నిర్వహించారు. జూరాల ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటి విడుదల, నీటి లభ్యత, ఆయకట్టు అవసరాలు, పంటలకు నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రస్తుత నీటి పరిస్థితిపై అధికారుల నుంచి వివరాలు తీసుకుని, రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.....రైతులపై నిజమైన ప్రేమ కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉంద న్నారు. రైతులను కాపాడుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వంపై ఉందని, ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.కృష్ణా నదిలో నీటి లభ్యత, జూరాల ఆయకట్టు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారాబందీ పద్ధతిలో సాగునీటిని అందిస్తామని తెలిపారు. వచ్చే వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై తగిన శ్రద్ధ చూపలేదని మంత్రి విమర్శించారు. ఎన్నికల ముందు నార్లాపూర్ వద్ద ఒక్క పంపును ఆన్ చేసి ప్రాజెక్టు పూర్తయినట్లు ప్రచారం చేశారని ఆరోపించారు. పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం గతంలో వరద నీటిని వినియోగించడంపై, కృష్ణా-భీమా నదులపై అవసరమైన బ్యారేజీల నిర్మాణంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి జూరాలకు నీటిని తీసుకురావడంపై ప్రభుత్వం ముందుగానే చర్యలు చేపట్టిందని, అయితే దీనిపై ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.రైతులకు సాగునీటిని వారాబందీలో ఇస్తామన్నారు.రైతులను కాపాడుకునే బాధ్యత మాదని తేల్చి చెప్పారు . జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండనివ్వమని,వచ్చే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా కూడా చర్యలు తీసుకుంటామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.జూరాల ప్రాజెక్టు నిర్మాణ నాణ్యతను ప్రస్తావిస్తూ, భారీ వరద ప్రవాహాలు వచ్చిన సందర్భాల్లోనూ ప్రాజెక్టు నిలకడగా ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

చేయూత పెన్షన్ల దరఖాస్తుల పరిశీలనకు గడువు పొడిగింపు

- **చేయూత కొత్త పెన్షన్ దరఖాస్తుల పరిశీలన గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగింపు**

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:
చేయూత సామాజిక భద్రత పెన్షన్లకు కొత్తగా వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఇప్పటివరకు సెప్టెంబర్ 25 వరకు ఉన్న గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగిస్తూ SERP సీఈఓ దివ్య దేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫీల్డ్ స్థాయి అధికారులు SIR విధులు, వినాయక నిమజ్జన ఏర్పాట్లు, ఇతర బాధ్యతల్లో నిమగ్నమై ఉండటంతో నిర్ణీత గడువులో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయలేకపోతున్నామని వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు చేయూత కొత్త పెన్షన్ దరఖా స్తుల పరిశీలనను పొడిగించిన గడువులోగా పూర్తిచేయాలని SERP ఆదేశించింది.దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

నేరెళ్ల శారద గారి నియామకం మహిళా నాయకత్వానికి, సామాజిక న్యాయానికి బలం: డా. రేఖ బోయలపల్లి

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 24, :

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేడు బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీమతి నేరెళ్ల శారద గారికి తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. "గతంలో మహిళా కమిషన్‌లో పనిచేసిన శారద గారు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, కాంగ్రెస్ పార్టీలో పలు కీలక బాధ్యతల్లో తన నాయకత్వాన్ని నిరూపించుకున్నారు. మహిళల సమస్యలపై ఆమెకున్న అవగాహన, న్యాయం కోసం పోరాడే దృఢ సంకల్పం ఈ బాధ్యతకు మరింత బలం చేకూరుస్తాయి," అని డా. రేఖ అన్నారు. అనుభవం ఉన్న మహిళా నాయకురాలికి ఈ బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్న టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బి. మహేష్ కుమార్ గౌడ్ గారిని కూడా అభినందించారు. "ప్రజాపాలనలో సామాజిక న్యాయం అంటే మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి సమర్థంగా పనిచేయడం," అని పేర్కొన్నారు. "మహిళా కమిషన్‌ను ఆశ్రయించే ప్రతి మహిళకు గౌరవప్రదమైన స్పందన, సకాలంలో సహాయం అందాలి. శారద గారి నాయకత్వంలో మహిళల భద్రత, గౌరవం, న్యాయం కోసం కమిషన్ మరింత చురుగ్గా పనిచేస్తుందని విశ్వసిస్తున్నాను. తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ తరపున ఆమెకు శుభాకాంక్షలు," అని డా. రేఖ బోయలపల్లి తెలిపారు.

గచ్చిబౌలిలో బటర్‌ఫ్లై హాస్పిటల్స్ ఉమెన్ & చిల్డ్రన్ గ్రాండ్ ఓపెనింగ్

- **ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు**

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:
గచ్చిబౌలిలో నూతనంగా ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై హాస్పిటల్స్ ఉమెన్ & చిల్డ్రన్ గ్రాండ్ ఓపెనింగ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళలు, చిన్నారులకు సమగ్ర వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ నూతన ఆసుపత్రి ప్రారంభోత్సవ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆధునిక వైద్య సదుపాయాలతో మహిళలు, శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి కృషి చేయాలని ఆకాంక్షించారు. 'ఆరోగ్యకరమైన తల్లులు – ఆరోగ్యవంతమైన పిల్లలు – ఉజ్వలమైన భవిష్యత్తు' అనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ ఆసుపత్రి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించాలని వారు పేర్కొన్నారు.

కంచే చేను మేస్తే... ఎన్నికల కమిషనే ప్రజాస్వామ్యానికి ప్రమాదమైతే?

- **ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలి**
- **ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రజాస్వామ్య పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంది**
- **టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్**

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 24:
ప్రజాస్వామ్యానికి కాపలాదారుగా ఉండాల్సిన ఎన్నికల సంఘం పనితీరుపైనే తీవ్రమైన ప్రశ్నలు తలెత్తడం ఆందోళనకరమైన పరిణామమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇటీవల ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన పరిశోధనాత్మక కథనం ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని నిర్ణయాలపై కనీసం 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వెల్లడైంది. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల తొలగింపు, ఫారం-6 మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, సాఫ్ట్‌వేర్ నియంత్రణ వంటి అత్యంత కీలక అంశాలపై ఈ అభ్యంతరాలు నమోదైనట్లు కథనం పేర్కొంది. "ఓటు దొంగిలించారనే ఆరోపణ కంటే... ఓటు హక్కుపై అనుమానం కలిగే పరిస్థితి రావడమే ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమా దం." రాహుల్ గాంధీ చాలా కాలంగా ఎన్నికల ప్రక్రియ లో పారదర్శకత, ఓటర్ల జాబితాల నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇప్పుడు ఎన్నికల సంఘం అంతర్గతంగా ఇద్దరు కమిషనర్లు లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన కథనం నేపథ్యంలో ఆ ప్రశ్నలకు మరింత ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని, కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు నిర్ణయ ప్రక్రియలో సాధారణ భాగమని పేర్కొంది. ఈ వివరణ నేపథ్యంలోనూ 14 అభ్యంతరాలపై తీసుకున్న చర్యలు, ఫారం-6లో మార్పులు, డేటాబేస్ నిర్వహణపై వచ్చిన అభ్యంతరాలకు పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. "ఎన్నికల సంఘం మీద ప్రజలకు నమ్మకం ఉండాలి, 'నా ఓటు సురక్షితమేనా?' అనే సందేహం మాత్రం ఒక్క భారతీయుడి మనసులోనూ ఉండకూడదు." ప్రత్యేకంగా ఫారం-6 మార్పులపై వచ్చిన అభ్యంతరాలు తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని ఆయన అన్నారు. కథనం ప్రకారం, ఇద్దరు కమిషనర్లు ఫారం-6లో చేసిన మార్పులకు చట్టపరమైన ఆధారం లేదని అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వెల్లడైంది. "చట్టంలో లేని నిబంధనను సాఫ్ట్‌వేర్‌లో పెట్టి ఓటరుపై అమలు చేయడం ప్రజాస్వామ్య పద్ధతి కాదు; ఓటరే కేంద్రబిందువు కావాలి, సాఫ్ట్‌వేర్ కాదు." ఓటర్ల జాబితా నిర్వహణలో అధికారాల కేంద్రీకరణపై కూడా కమిషనర్లు ఆందోళన వ్యక్తం చేసినట్లు కథనం పేర్కొంది. రాష్ట్ర స్థాయిలో చట్టబద్ధ అధికారాలు కలిగిన ఎన్నికల అధికారులు తమ బాధ్యతలను స్వేచ్ఛగా నిర్వర్తించగలిగేలా వ్యవస్థ ఉండాలని, డిజిటల్ వ్యవస్థ ప్రజల ఓటు హక్కుకు అడ్డంకిగా మారకూడదని ప్రవీణ్ కుమార్ అన్నారు. గోవాలో 97 మంది ఓటర్ల విషయంలో స్థానిక ఎన్నికల అధికారి అర్హతను గుర్తించినప్పటికీ, సాఫ్ట్‌వేర్ వ్యవస్థలో నిర్ణయాన్ని నమోదు చేయలేకపోయిన ఘటనపై కూడా స్పష్టత అవసరమన్నారు. సంఖ్య 97 మాత్రమే అయినప్పటికీ, ఒక్క అర్హుడైన ఓటరుకైనా ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి రాకూడదనేదే ప్రజాస్వామ్య సూత్రమని అన్నారు. "97 ఓట్లు చిన్న సంఖ్య కావచ్చు... కానీ ఒక్క అర్హుడైన పౌరుడి ఓటు కూడా ప్రజాస్వామ్యంలో చిన్న విషయం కాదు." ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన సంస్థ అని, దాని నిర్ణయాలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండటం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘంలో అభిప్రాయ భేదాలు ఉండటం అసాధా రణం కాకపోయి నా, ఆ భేదాలు ఎలాంటి నిర్ణయాలకు దారితీశాయి, ఆ నిర్ణయాలు ఎలా తీసుకున్నారు, ఎవరి ఆమోదంతో తీసుకున్నారు అనే అంశాలపై పారదర్శకత ఉండాలని అన్నారు. నివేదికలో 2023 చట్టంలోని సెక్షన్ 18 ప్రకా రం కమిషన్ వ్యవహారాలు సాధ్యమైనంత వరకు ఏకాభిప్రాయంతో జరగాలని, అభిప్రాయ భేదం ఉంటే మెజారి టీ ప్రకారం నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. "ఎన్నికల సంఘం రాజ్యాంగానికి కాపలాదారు; ఏ రాజకీయ పార్టీకి కాపలాదారు కాదు. దాని నిర్ణయాలు పార్టీ ప్రయోజనాల కు కాదు, ప్రజల ఓటు హక్కుకు జవాబుదారీగా ఉండాలి." కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2023లో ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థలో చేసిన మార్పులపై కూడా కాంగ్రెస్ మొదటి నుంచీ అభ్యంతరం వ్యక్తం చేసిందని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలవాలంటే నియామకాల నుంచి నిర్ణయాల వరకు ప్రతి దశలోనూ సంస్థాగత స్వతంత్రత, పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని అన్నారు. "బీజేపీకి అధికారంలో ఉండటం ఎంత ముఖ్య మో, ప్రజాస్వామ్యానికి ప్రజల ఓటు అంతకంటే ముఖ్యమై నది. ఓటు స్వేచ్ఛను బలహీనపరిచే ఏ వ్యవస్థనైనా కాంగ్రెస్ ప్రశ్నిస్తుంది." దేశంలో ఎన్నికలు కేవలం ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రక్రియ కాదని, ప్రజలు తమ పాలకులను ప్రశ్నించే, మార్చే రా జ్యాంగబద్ధమైన హక్కుకు సంబంధిం చిన వ్యవస్థ అని ఆయన అన్నారు.ప్రజల ఓటు స్వేచ్ఛపై ఎలాంటి మానాలు రాకుండా ఎన్నికల సంఘం అన్ని వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని, కమిషనర్ల అభ్యం తరాలపై స్పష్ట మైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. "ప్రజల ఓటే రాజ్యాంగానికి బలం. ఆ ఓటు బలహీనపడితే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. అందుకే ఓటు హక్కు కోసం కాంగ్రెస్ చివరి వరకు పోరాడుతుంది." ప్రజా స్వామ్య పరిరక్షణ అనేది ఒక్క రాజకీయ పార్టీ బాధ్యత కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రవీణ్ కుమార్ అన్నా రు. ఓటర్ల జాబితా నుంచి ఒక్క అర్హుడి పేరు అన్యాయంగా తొలగించబడకుండా, ఒక్క అనర్హుడి పేరు కూడా అక్ర మంగా చేర్చబడకుండా, ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రజల నమ్మకానికి అనుగుణంగా సాగాలని ఆయన స్పష్టం చేశారు.




ప్రధమ వర్ధంతి
రచయిత, తెలంగాణ చరిత్ర పరిశోధకులు, సాహితీవేత్త, అధ్యయనశీలి
కీ.శే. కొంపెల్లి వెంకట్ గౌడ్ వర్ధంతి సభ
తేదీ : 25-09-2026 శుక్రవారం
సమయం: ఉ॥ 10 గం॥ల నుంచి మ॥ 2 గం॥ల వరకు.
వేదిక : సుందరయ్య విజ్ఞాన కేంద్రం - షోయబ్ హాల్
అడ్రస్: బాగ్ లింగంపల్లి, హైదరాబాద్, తెలంగాణ
ఇట్లు
కొంపెల్లి వెంకట్ గౌడ్ మిత్ర బృందం
CONT: 9848034991, 9963587898, 9949652024, 7013901466

ఇంటి వద్దకే
మీసేవ
డోర్ డెలివరీ సేవలు
మీ సేవ
సులభంగా, వేగంగా
మీ సేవ
మంత్రి శ్రీధర్‌బాబు
చేతుల మీదుగా సేవల ప్రారంభం
1100కు ఫోన్ చేసి స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం
70 మందికి పైగా MEESEVA ఏజెంట్లకు శిక్షణ
మీసేవ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్..
తొలి దశలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్
ఇంటి వద్దకే మీసేవ ఎగ్జిక్యూటివ్ సేవలు
త్వరలో రాష్ట్రవ్యాప్తంగా డోర్ డెలివరీ సేవలు
శ్రీ హర్కార వేణుగోపాల్ రావు
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు
(ప్రోటోకాల్ మరియు ప్రజా సంబంధాలు)
HarkaraRao
Harkararao


ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి
తెలంగాణ రాష్ట్రం
ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి
తెలంగాణ రాష్ట్రం
నల్లొండ జిలాల్లో
ఫ్లోరోసిస్ సమస్యను
1945 లో గుర్తించారు.
రాజకీయ నాయకుల అవగాహన లోపం
ప్రభుత్వ అధికారుల అలసత్వం
ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులకు శాపంగా మారింది.
మీ నిర్లక్ష్యానికి బలైన ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులకు
పదిహేను వేల రూపాయలు
పెన్షన్ ఇవ్వాలి.
సదరంలో గుర్తించిన ప్రతి ఒక్కరికి ఇప్పుడు
ప్రభుత్వము పెన్షన్లలో అందరికీ తప్పనిసరి ఇవ్వాలి.
డా. కంచుకట్ల సుభాష్
రాష్ట్ర కన్వీనర్
శుద్ధమైన త్రాగునీరు
సాగునీరు
ఫ్లోరోసిస్ బాధితులకు న్యాయం
ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి – తెలంగాణ రాష్ట్రం

WORK DAYS

Friday • Saturday
Sunday • Selected Holidays

FLEXIBLE SHIFTS

10:00 AM – 4:00 PM — Male & Female Candidates

2:00 PM – 10:00 PM — Male & Female Candidates May Apply*

*Late-shift deployment will be subject to applicable statutory safety requirements and candidate consent.

18+ Students
Undergraduates
Graduates
Job Seekers

MULTIPLEX LOCATIONS & VACANCIES (ESP)

S.No.	Property Name	Location	Designation	Required
1	AMB	Hyderabad	ESP	50
2	AMB	Banglore	ESP	40
3	ART	Hyderabad	ESP	25
4	AAA	Hyderabad	ESP	10
5	AAA	Vizag	ESP	20
6	RADHIKA	ECIL	ESP	11
7	CINEMART	RC PURAM	ESP	10
8	MJR	NARAPALLY	ESP	15
9	M-CUBE	ATTAPUR	ESP	10
10	CINEPLANET	KOMPALLY	ESP	15

S.No.	Property Name	Location	Designation	Required
11	CINEPRIDE	MOOSAPET	ESP	15
12	SHA	CHINTAL	ESP	5
13	INDRA NAGENDRA	KARMANGHAT	ESP	3
14	KONARK	DSNR	ESP	10
15	RAJLAXMI	UPPAL	ESP	6
16	JYOTHI	RC PURAM	ESP	5
17	MUKUND	MEDCHAL	ESP	5
18	TARAKARAMA	KACHIGUDA	ESP	5
19	SUPER	BALAPUR	ESP	10
	TOTAL VACANCIES			270

WHAT YOU'LL DO

- Guest assistance & customer service
- Ticketing and queue management
- F&B support (Food & Beverages)
- Theatre operations
- Help create a great movie-going experience for all patrons

EARN PART-TIME INCOME
Payment based on actual hours worked and processed fortnightly, subject to applicable minimum wages and statutory requirements.

GAIN REAL CINEMA INDUSTRY EXPERIENCE
Be part of an exciting and dynamic industry.

CERTIFICATE OF WORK EXPERIENCE
Certificate of Work Experience / Participation may be provided on successful completion*.

WORK CLOSE TO YOUR HOME
Opportunity to work at a cinema closer to your home, subject to availability.

APPLY NOW

Send Your CV to s9guru@gmail.com

Contact: Ashwin 98491 94366

Kindly share this info with job aspirants for Part time Job in Multiplexes

CINEMA BRINGS US TOGETHER

Good People Create Great Experiences!

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com